# కథా-జీవితం

## ముప్పాళ రంగనాయకమ్మ

ఇందిర మనస్సు చాలా అశాంతిగా ఉంది.

రాత్రంతా నమ్మకంగా నిద్ర పట్టలేదు. దాదాపు జాగారం అయింది. పాప చెప్పిన మాటలు విన్నప్పట్నుంచీ మనసు మనసులో లేదు. లలిత...తనకన్నా ఎంతో చిన్నది. లలిత... అంత గ్రంధకర్త అయిందా? పోనీ అది చిన్నదీ-లోకజ్ఞానం తెలియందీ అనుకుంటే— ఈయన వివేకం ఏమైపోయింది? ఆరేళ్ళుగా తనతో సహవాసం చేసి...ఇద్దరు బిడ్డల్ని కని...భగవంతుడా! ... ఇంతేనా అనురాగాలు! ఇంత అల్పమా జీవిత బాంధవ్యాలు!

"అక్కయ్యా! ఇంకా పత్రిక కుర్రాడు రాలేదా?" గబగబా వచ్చింది లలిత— "అరె! పదికూడా దాటింది. ఎక్కడో షైర్లు కొడుతున్నాడీ వెధవ!" అంది దురుసుగా.

ఇందిరకు మాట్లాడా లనిపించలేదు. అయినా అంది - "వాడే వస్తాడు. ఆ మాత్రానికి తిట్టుకోటం ఎందుకూ?"

"తిట్టుకోక ఏం చేస్తారేం? తొమ్మిది కల్లా ట్రైన్ వచ్చేస్తుంది. పదిగంటలకైనా పేపరు తెచ్చి చావకపోతే..."

"మనకు పేపరిచ్చే భాగ్యానికి వాడెన్ని సార్లు చచ్చి బ్రతుకుతాడు? లేకైతే రాగానే నిలదీసి అడుగు. అదీ పద్ధతి."

లలిత మాట్లాడకుండా మూతి ముడుచుకుని వంటింట్లోకి పోయింది.

ఇందిర లేచి కూర్చుంది. చాలా నీరసంగా వుంది. టెంపరేచర్ లేకపోయినా లేచి తిరగలేకపోతోంది. చూస్తోండగానే రోగిష్టిదానిలా తనింత నీరసపడిపోయిందేమిటి? చిక్కిపోయి — శరీరమంతా పల్చబడి— గాజులు కూడా వదులైపోయి ...ఎప్పటిలాగా ఆరోగ్యం వస్తుందో లేదో!

"ఇంకా రాలేదా?" మళ్ళా వచ్చింది లలిత విసుగ్గా చూస్తూ.

"ఎవరూ?"

"అదే. పేపరువాడు."

"రాలేదు. ఏం? ఎందుకంత కంగారు పడిపోతున్నావు? నీ రిజల్ట్సుగాని వస్తాయేమిటి?" ఆశ్చర్యంగా చూసింది ఇందిర.

"గాడిదగుడ్డు! రిజల్ట్సు వచ్చేదేమిటి? నేను ష్యూర్‌గా పాసౌతాను." అతిశయంగా అంది లలిత.

"అయితే మరెందుకీ కంగారూ?"

"వీక్లీ నిన్న రానేలేదు. ఇవ్వాళైనా తెస్తాడో లేదో! ఎక్కడో పెత్తనాలు చేస్తున్నాడు వీడు. కావాలంటే వచ్చాక ఏదో నసుగుతాడు చూడు."

"చూద్దాంలేగానీ వీక్లీలో న్యూసేమిటి? ఏదైనా డిటెక్టివ్ కథ పడుతోందా?"

"కాదక్కయ్యా! క్రిందటివారం సుడిగుండం అనే కథ నువ్వు చదవలేదూ? భలే బావుంది కదూ? మంచి సస్పెన్స్‌లో పెట్టి సశేషం అన్నాడు. చచ్చేకోపం వచ్చింది. సేల్స్‌కోసం నానా తిప్పలూ పడుతుంటారీ పత్రికలవాళ్ళు."

"కిటుకేమిటో తెలిసిపోయాక ఆ పత్రిక కొనకపోతే నేం?"

"అమ్మో! అసలే సస్పెన్స్‌తో వారం రోజులనుంచీ చస్తున్నాను. విసుగొచ్చేస్తోంది."

ఇందిర సాలోచనగా అంది - "అసలేమిటా కథ? కొంచెం చెప్పు. జ్ఞాపకం వస్తుంది."

"అదే అక్కయ్యా! వేణుగోపాల్ అనీ ఓ లెక్చరర్ వుంటాడూ - పెళ్ళాం పేరు సావిత్రి. చదువూ సంధ్యా వుండవు— ఓసారి వాళ్ళిద్దరూ డాన్సుప్రోగాం కెళ్ళి.."

"ఆ డాన్సర్ తళుకూ బెళుకూ చూసి దాని వెనకాల పడతాడు కదూ? ఆ డాన్సర్ పేరేమిటబ్బా మర్చిపోయాను."

"నళిని. సన్నగా తెల్లగా చాలా అందంగావుంటుంది కదూ? వేణుగోపాల్ నళినిని మనసారా ప్రేమిస్తాడు."

ఇందిరకి ఒళ్ళు మండింది— "ప్రేమ... ప్రేమ అంటే అసలు నీకు అర్థం తెలుసా? పైగా మనసారా కూడానా? ఒకప్పుడు సావిత్రిని కూడా అలాగే ప్రేమించాడుగా?"

"సావిత్రిని ప్రేమించలేదు. ప్రేమించానని భ్రమపడ్డాడంతే."

"అయితే ఇప్పుడు నళినినే నిజంగా ప్రేమిస్తున్నాడన్నమాట."

"నువ్వు సైకాలజీకూడా చదివావ్. ఎందుకంత హేళనగా మాట్లాడుతావ్?" ఉక్రోషంగా అంది లలిత- "అసలు సావిత్రి వేణుగోపాల్ ప్రేమ పొందడానికి ఎంత మాత్రం తగదు."

"ఆ విషయం అతను పెళ్ళికి ముందే ఎందుకు ఆలోచించుకోలేదు? ఇప్పుడు నళినిని ప్రేమించానంటావా?"

"అదేమిటక్కయ్యా! చలం నీ ఫేవరెట్ కదా? అలా మాట్లాడుతావేం? ఆకర్షణ అనేదే ఎప్పు డెవరిమీద కల్గినా కలగవచ్చని చలం ఎన్నో కథలు రాశాడు కదూ?" ఇందిర మ్రాన్పడిపోయింది. లలిత లాంటి వాళ్ళంతా చలాన్ని అడ్డం వేసుకుంటోంటే...చలం! నువ్వు సాధించిన మంచిచెడ్డల్ని తరాజులో వేసి నీ ఎదటే తూస్తే తప్పకుండా మూర్ఛబోతావు. "లలితా! చలం నీలాంటి మూర్ఖులకి రాయలేదు.'' అందామనిపించింది—

"ఊఁ. ఇంతకీ ఆ కథలో సస్పెన్సేం వుందీ?"

"అదే చివరి కేమౌతుందో చనువుదామనీ.''

"ఏమైతే బావుంటుంది నీకు?"

"వేణుగోపాల్ నళినిని పెళ్ళి చేసుకుంటే బావుంటుంది కదూ?''

"మరి సావిత్రి?" ఆశ్చర్యంగా అడిగింది ఇందిర.

"ఏ జబ్బో చేసి చచ్చిపోతే సరి."

అదరిపడింది ఇందిర. గుండెలు దడదడా కొట్టుకున్నాయి. సాధ్యమైనంత తమాయించుకుంటూ సూటిగా చూసింది- "పాపం సావిత్రి ఎవరి కేం అపకారం చేసింది లలితా?''

లలిత కాస్త కలవరపడింది-" అదికాదక్కయ్యా! నళినికూడా వేణుగోపాల్‌ని గాఢంగా ప్రేమిస్తోందిగా?"

"సావిత్రి కంటేనా?''

"అసలు సావిత్రికి ప్రేమంటే ఏం తెలుసూ?''

ఇందిరకి ఎంతకోపం వచ్చిందంటే —— లలిత తృళ్ళిపడేలాగ చెంపపెట్టు పెడదామనిపించింది. వెధవ్వాగుడు.


అక్కగారి మౌనంచూసి లలితే అంది- "నాతో యింత తర్కిస్తున్నావ్ గానీ అసలు రచయిత వేణుగోపాల్ నెంత సపోర్ట్ చేస్తున్నాడో చదివావుగా? రీడర్స్‌కి నళినిమీదా గోపాల్ మీదా సింపతీ వచ్చేలాగ..."

"ఇప్పు డలాగే అన్పిస్తుంది. తర్వాత వేణుగోపాల్ పశ్చాత్తాప పడతాడేమో! కథలో ఏదో ట్విస్ట్ వుంటుంది. ఒకవేళ నువ్వు అన్నట్టే కథ ముగిస్తే రైటర్ తప్పతాగి కూర్చుని జోగుతూ రాశాడని నేను పందెం వేస్తాను," అంది ఇందిర ఆవేశంగా తీక్షణంగా చూస్తూ.

కూర మాడువాసన ఎప్పటినుంచో వస్తోంది - "అయ్యయ్యో! మర్చేపోయాను," అంటూ వంటింట్లోకి పరిగెత్తింది లలిత. ఇందిర వెర్రిదానిలా గుమ్మంకేసే చూస్తూ కూర్చుంది ఎంతోసేపు. లలిత చెప్పే కథకీ-తన సంసారానికీ చాలా చాలా పోలిక వుంది. సాక్షాత్తూ తన మొగుడే వేణుగోపాల్‌లా తయారౌతున్నా డనటానికి చాలా ఋజువులు దొరుకుతాయి. నిమ్మకు నీరెత్తినట్టు తనెందు కింత ముభావంగా వుంటోంది?

పేపరు పడింది కిటికీలోంచి.

అడక్కుండానే చెప్పాడు వాడు -



"ఇవ్వాళ బండి చాలా లేటమ్మా! వీక్లీ కూడా రాలేదు. రేపొచ్చేస్తుందిలెండి." హడావుడిగా సైకిల్ తొక్కుతూ వెళ్ళిపోయాడు. ఇందిర మనస్సు కొంచెం తేలిక పడింది. లేచి పేపరు తీసి టేబిల్ మీద పెట్టింది–వంటింట్లోకి వెళ్ళి మాడిన కూర తీరుతెన్నులు చూద్దామనుకుంది. వెళ్ళ బుద్ధికాలేదు. మందు తాగి నీరసంగా మంచంమీద పడుకుంది.

* * *

నెలరోజుల క్రిందట...

ఇందిరకి వాంతులతో ప్రారంభమైంది జ్వరం. రెండురోజులు లెలాగో తినీతినకుండా యింట్లోపనులు చేసుకుంది. మరో రెండు రోజులు ఆఫీసుకు శెలవుపెట్టి నానా హైరానా పడ్డాడు ప్రకాశం. దగ్గిర కూర్చుని చెప్పి చేయించుకునే ఓపికకూడా లేదు ఇందిరకు. వంటమాటెలావున్నా పిల్లల్ని చూడటం చెడ్డవిసుగ్గా వుంది ప్రకాశానికి. చంటివాడికి తోకఒక్కటే తక్కువ. తినేసి దొడ్డికి పరిగెత్తడం తప్పితే మరో వుద్యోగం లేదు వాడికి. వాడి సేవతో కంగారెత్తిపోయాడు ప్రకాశం.

"ఇందిరా! మీ అమ్మగార్ని అర్జంటుగా రమ్మని వైరిచ్చేస్తాను," అన్నాడు గరిటె అవతల పారేసి బట్టలు వేసుకుంటూ.

ఇందిర లేచి కూర్చుంది– "మా అమ్మ అయితే వారంరోజులైనా వుండకుండా వెళ్తాను, వెళ్తా నని కూర్చుంటుంది. పోనీ లలితకి శెలవులేగా? ఎప్పుడూ రాలేదు కూడాను. దాన్నిపంపించమనిరాయండి."

"ఇది మరీ బాగుంది. నీ చెల్లాయి రావటం కాస్త పనీపాటా చెయ్యటానికా? సినిమా లవీ చూడటానికా?"

"ఫర్వాలేదు. లలితకి...అన్నీ వచ్చు. దానిదగ్గిర పిల్లలకికూడా అలవాటే."

"సరే! అయితే." – తీరా బయల్దేర బోతూ వెనక్కి తగ్గి– "అసలు లలితని పంపిస్తారా మీ వాళ్ళు?" అన్నాడు ప్రకాశం సందేహిస్తూ.

"ఏం? ఎందుకు పంపించరు?" కళ్ళు విప్పి ఆశ్చర్యంగా చూసింది ఇందిర.

"ఏమోలే! పెద్దవాళ్ళ కన్నీ ఎక్కడ లేని అనుమానాలు."

"అసలు వాళ్ళకు లేని అనుమానా లన్నీ మీకే."

ప్రకాశం మరేమీ అనకుండా వెళ్ళిపోయాడు.

మర్నాడు సాయంత్రంవేళ వచ్చింది లలిత.

సాక్షాత్తూ దేవతలా కన్పించింది ఇందిరకి–"వచ్చావా తల్లీ? అబ్బ! జ్వరంతో నేను మంచం ఎక్కితే...ఇల్లు చూడు... ఎలా వుందో!...అదిగో! చంటివెధవ రాగం...వంటింట్లో స్టౌ వుంది. బల్లమీద పాలున్నాయి. కొంచెం వెచ్చబెట్టి ముందు వాడి కిచ్చెయ్. లేకపోతే ఒకరిమాట లొకరికి విన్పించవు. వెళ్లు ముందు," అంటూ పని పురమాయించింది.

లలిత కార్యరంగంలోకి దూకుతోన్నట్టు–పైటకొంగు నడుంచుట్టూ బిగించింది–"రారా గాడిదా! ఎందుకలా అరుస్తావ్ ఇంజన్‌లాగా?" అంటూ వాణ్ణి బరబరా లాక్కుపోయింది. మరో పావు గంటకికానీ వాడి రాగం కట్టలేదు. నీళ్లు పోసి వుతికినచొక్కా తొడిగి తీసుకొచ్చింది.

"వీడు నాదగ్గిర కూర్చుంటాడుగానీ– రెండు డబ్బాలు బియ్యం కొలిచి అన్నం వండు. పొద్దుటి కూర లేవో వున్నాయిలే. ఫర్వాలేదు. నీ స్నానం అయ్యాక మళ్ళా వేడినీళ్లు పడెయ్," ఓపిక తెచ్చుకుంటూ చెప్పింది ఇందిర.

"బావగా రెప్పుడొస్తారు?"

"వచ్చేస్తారు. కాస్త ఈ జ్వరం వచ్చిన దగ్గిర్నుంచీ పెందరాడే వస్తున్నారు మరి. కాఫీ ఫ్లాస్క్‌లో పోసివుంచు. అన్నట్టు సుజా ఆడుకోవటానికి పోయింది. రాగానే నీళ్ళుపొయ్యి."

"సరేలే. అన్నీ నేచేసేస్తాలే," అంటూ హుషారుగా వంటింట్లో కెళ్ళిపోయింది లలిత. కూనిరాగాలు తీస్తూ పని ప్రారంభించింది. డబ్బాలూ – తట్టలూ బుట్టలూ అన్నీ సర్దింది. గదులు శుభ్రంగా తుడిచింది. బండెడు విడిచిన గుడ్డలు నానబెట్టింది. స్టౌ అంటించి ఎసరు పడేసింది.

ప్రకాశం యింటికి వచ్చాడు. ఇందిర మొహం కళకళ్ళాడుతోన్నట్టు కన్పించింది– "లలిత వచ్చింది," అంది శుభ వార్త చెప్తోన్నట్టు.

"వచ్చేసిందా? గడుసుపిండమే. స్టేషన్ కెళ్దామనుకున్నాను గానీ ఆఫీసులో వీలు కాలేదు. సరేలే! కాలేజీపిల్ల...ఆమాత్రం నోట్లోనాలిక లేకుండా వుంటుందా అని..."

"నాలికేం ఖర్మ? పళ్ళు కూడా వున్నాయి. జ్ఞాపకం పెట్టుకోండి." నవ్వుతూ అంది ఇందిర.

"నాన్నా! నాన్నా! పిన్ని వచ్చింది, పిన్ని," అంటూ చెయ్యి పట్టుకు లాగింది సుజాత.

"పదరా మీ పిన్నిని చూద్దాం," అంటూ కొడుకుని ఎత్తుకుని వంటింట్లోకి బయల్దేరాడు ప్రకాశం.


కూనిరాగాలు తీస్తోన్న లలిత ఠక్కున ఆపేసి సిగ్గుపడుతూ మొహం తిప్పుకుని నించుంది. బావగారు తెలిసినవాడే అయినా ఎప్పటి కప్పుడే కొత్తా! సిగ్గూ!

"చూడు పిల్లా! పనీ అదీ చేసుకోగానీ– పాటలు మాత్రం పాడకు. ఇంట్లో ఓ పేషెంటూ–ఇద్దరు వంటివాళ్లూ– పాపం పారిపోలేరు చూడు."

వెనకాలే వచ్చిన ఇందిర నవ్వింది – చాల్లెండి. అసలే సిగ్గుపడుతోంది. అయినా లలిత ఎంతబాగా పాడుతుందో తెలుసా?" అంది.

ప్రకాశం కాఫీ తాగి వారం రోజుల నుంచీ మొహంవాచివున్న రోడ్ల కొలత లకి బయల్దేరాడు.

"కొంచెం తొందరగా వచ్చెయ్యండి. అర్ధరాత్రివరకూ మీ కోసం లలిత కూర్చో




లేదు. నే ననలే వుండలేను," అంటూ గొణిగింది ఇందిర.

ఎనిమిదిగంటల కల్లా లలిత బట్టలన్నీ ఉతికి స్నానం చేసి వచ్చింది. ఇల్లు కళకళలాడుతున్నట్టయింది.

"లలితా! రెండురోజులనుంచీ తల దువ్వుకోలేదు. కాస్త చిక్కు తీద్దూ!" అంది ఇందిర నెమ్మదిగా లేచికూర్చుంటూ.

లలిత చిక్కులు విప్పుతూ కూర్చుంది. పుట్టింటి కబుర్లన్నీ మహోత్సాహంగా చెప్పుకుపోతోంది.

"అబ్బ! ఏమిటే? కొత్త చిక్కులు వేస్తున్నావు."

"లే దక్కయ్యా! నెమ్మదిగా తీస్తున్నాను."

ప్రకాశం తొమ్మిదిన్నరకి వచ్చాడు—"చాలా తొందరగా వచ్చేశాను కదూ?" అన్నాడు.

"అంతేమరి," అంది ఇందిర.

బజారునుంచి వచ్చిన కూరలన్నీ సర్దింది లలిత.

ప్రకాశం స్నానానికి వెళ్ళాడు.

"లలితా! బావకి అన్నం పెట్టు," అంది ఇందిర పడుకుంటూ.

"అన్నీ అక్కడ పెట్టేస్తాగానీ నేను దగ్గిర కూర్చోను బాబూ!" అంటూ వెళ్ళింది లలిత. పీటవేసి అన్నం వడ్డించింది.

మళ్ళా గదిలోకొచ్చి కూర్చుంది.

ప్రకాశం మజ్జిగ పోసుకుంటూ—"ఇందిరా! వుప్పు కావాలి." అంటూ అరిచాడు.

ఇందిర లలిత కేసి చూసింది—"వెళ్ళి చూడు. పరాయివాళ్ళా ఏమిటి అంత సిగ్గు పడటానికి?" అంటూ మందలించింది—

వంటింట్లోకి వెళ్ళింది లలిత. బావగారి పళ్ళెంలో వుప్పు వేసి తలుపు నానుకుని నించుంది.

ప్రకాశం తలఎత్తి చోరవగా చూశాడు—"చిన్నప్పుడు నా దగ్గిర ఎన్ని దెబ్బలు తీసుకునే దానివో! అప్పుడే మర్చి పోయావా?" అన్నాడు నవ్వుతూ. లలిత సిగ్గుతో మాట్లాడలేదు. ఇందిర పెళ్ళినాటికి లలిత పన్నెండేళ్ళది. పరికిణీలు కట్టుకు తిరిగేది—అబ్బ! ఆరేళ్ళలో ఎంత మార్పు! మిసమిసలాడుతూ—తెల్లగా—ఎత్తుగా—పెద్ద పెద్ద కళ్లూ—బారెడు జడా—చాలామంది ఆడవాళ్లు కథల్లోకన్నా వెయ్యోరెట్లు అందంగా వుంటారు.

"లలితకు చాలా సిగ్గులా వుంది," అన్నాడు ప్రకాశం గదిలోకొస్తూ.

నిద్రరాని కళ్ళతో నీరసంగా చూస్తూ—"అం సిగ్గే. రెండు రోజులు పోనివ్వండి. ఎలా వాగుతుందో!" అంది ఇందిర.

*           *           *

మర్నాడు కాఫీలవేళ లలిత కాస్త సిగ్గు వదిలించుకుని మాట్లాడింది బావ గారితో.

"పరీక్ష ఎలా రాశావు?"

"బాగానే రాశాను."

"క్లాసు వస్తుందా?"

"ఏమో! నాకేం జ్యోతిష్యం తెలుసా?"

"అబ్బో! జాతకచక్రాలమీద ఆధార పడి వుందా నీ పరీక్ష?" అంటూ నవ్వాడు ప్రకాశం.

కాఫీ తాగుతూ ఇందిర దగ్గిరికి వెళ్ళాడు.

"ఎలా వుంది ఇందిరా?"

"టెంపరేచర్ ఎక్కువైనట్టుంది. నిన్నట్లా లేదు." నీరసంగా పడుకుని వుంది ఇందిర.

"లేచి కొంచెం మొహం కడుక్కుని మందు వేసుకో. డాక్టర్ గారికి చెప్పి వెళ్తాను. ఏదైనా మందు మారిస్తే సాయంత్రం చూద్దాం."

ఇందిర ఓపిక తెచ్చుకుని లేచి కూర్చుంది—

మొక్కు తీర్చుకున్నట్టు మందు మింగి మళ్ళా పడుకుంది. ఆ పడుకోవటం పడుకోవటం వారంరోజులవరకూ మూసిన కన్ను తెరవకుండా—మందు మింగటం తప్పితే మరో ధ్యాస తెలీకుండా—పడుకుంది చలిజ్వరంతో. టెంపరేచర్ తగ్గినట్టే తగ్గి హెచ్చుతూ వుండటంతో పథ్యం ప్రసక్తి ఏ రోజు కారోజే వాయిదా పడుతూ వచ్చింది.

మొత్తంగా జ్వరం తగ్గింది. రోజంతా రాలేదు.

"అసలు తిండిలేకన్న జెంక్షన్నా ఎలా ఒళ్ళూ మాసి కంపరం పుడుతోంది," అంటూ విసుక్కుంది ఇందిర చెమటలు ఒత్తుకుంటూ—"లలితా! నీళ్ళు పెడుదూ!

తల రుద్దేసుకుంటాను. తేలిగ్గానే వుంది," అంది లేస్తూనే.

"జ్వరం తగ్గిందో లేదో అప్పుడే తల రుద్దుకుంటావా? భలేదానివే!" ప్రకాశం కొంచెం కోపంగా చూశాడు.

"నా బాధ మీ కేం తెలుసు? చిరాకుతో చచ్చిపోతున్నాను. మనిషిదగ్గిర ఇంత వాసన వస్తే డాక్టరుగారుమాత్రం ఏమను కుంటారు?"

"తల రుద్దుకో లేదను కుంటారా?" అంటూ నవ్వాడు.

ఇందిరకి వుక్రోషం వచ్చింది–"అవును. మీకు నవ్వులాటలాగే వుంటుంది. నేను మాత్రం తలంటుకోవటం మానను. లలితా! వెళ్లు, బాయిలర్ అంటించు. నీక్కాదూ చెప్పింది?" అంటూ కోపంగా చూసింది.

**లలిత** బావగారికేసి చూసింది.

ప్రకాశం లలితని వెళ్ళిపొమ్మని సైగ చేశాడు. ఇందిర దగ్గిర కూర్చుంటూ – "సరే! తలంటుకుంటా వనుకో, ఏమన్నా అయితే?"

"ఏమౌతుంది?"

"ఏదో అవుతుంది. ఇప్పుడు తెలుస్తుందా?"

"పోనీ అయితే అవుతుంది. మీ కేం?"

"చాల్లే! పిచ్చిదానిలా మాట్లాడకు," అంటూ లేచాడు – నువ్వు తలంటుకున్నా వంటే నేను అన్నం తినను."

"పోనీ మానండి, నా కేం?"

"ఛీ! పెంకిఘటం!" – విసురుగా బయటికి వెళ్ళిపోయాడు– "నీయిష్టం వచ్చినట్టు చేసుకో," అని అరుస్తూ.

ఇందిర తీరిగ్గా పడుకుంది – ప్రకాశం కోపం చూస్తే నవ్వొచ్చింది. తన కేమైనా అయితే ఆరాటపడే భర్త – అసలు తనకి చాలా సీరియస్ అయినప్పుడు – దగ్గిర కూర్చుని దిగులుగా భయంగా చూస్తోంటే ఎంత తృప్తిగా వుంటుందో!

ఇందిర జ్వరం ధర్మమా అని లలిత సిగ్గు వదిలిపోయింది. నవ్వుతూ పేల్తూ సుబ్బరంగా మాట్లాడేస్తోంది బావగారితో.

మరో రెండురోజుల్లో ఇందిర పథ్యం తింది. తలంటుకుంది. నిద్రపోకుండా పుస్తకాలేవో తిరగవేస్తూ కూర్చుంది.

వరండాలో ప్రకాశం, లలితా పిల్లల గంతులు చూస్తూ, పగలబడి నవ్వుతూ – చప్పట్లు కొడుతూ – పిల్లలకంటే ఎక్కువ అల్లరి చేస్తున్నారు.

ఇందిరకి మందుమాట జ్ఞాపకంవచ్చింది.

"లలితా!" అంటూ పిల్చింది రెండు మూడుసార్లు.

"సుజా!" అంది మరో రెండుసార్లు.

వాళ్ళ నవ్వుల లోకంలో ఇందిర కేకలు జొరబడనేలేదు – ఇందిరకు చిరాకు వేసింది. లేచివెళ్ళి నీళ్లు తెచ్చుకుని మందు వేసుకుంది.

లలిత నవ్వుతోందో మాట్లాడుతోందో తెలీకుండా నవ్వుతూ మాట్లాడుతోంది.

ఇందిర లేచి వెళ్ళింది. ప్రకాశం, లలితా ఇలస్ట్రేటెడ్ వీక్లీలో కొత్తగా పెళ్లయినవాళ్ల ఫోటోలు చూస్తున్నారు.

''బావా! ఈ అబ్బాయి గెడకర్రలా వున్నాడు కదూ? చూడు ఈ అమ్మాయి ఎంత బొండాంలా వుందో!...ఇదిగో – ఈ చివర ఫోటోలో అమ్మాయైతే వీడికి సరి పోతుంది. బావోయ్! ఆ బొండానికి ఇక్కడో బొండాం వున్నాడు," అంటూ జంటల్ని విడదీసి సన్నటివాళ్ళకి సన్నటి వాళ్ళనీ – లావుగా వున్నవాళ్ళకి లావు వాళ్ళనీ – అందమైనవాళ్ళకి అందమైన వాళ్ళనీ–కలిపి చెప్పుకుంటూ నవ్వుకుంటు న్నారు.

చూస్తోన్నకొద్దీ ఇందిరకి అసహ్యం వేసింది. లలిత చిన్నప్పట్నుంచీ చలాకీ అయిందేగానీ – కాలేజీలో చేరింతర్వాతే ఇలాంటి వెధవఅల్లరి నేర్చినట్టుంది. మరీ చిన్నదా? చితకదా? అయినా ఈ పెద్ద మనిషికైనా ఇంగితం వుండద్దూ?–

"దానికి బుద్ధి లేకపోతే మీకైనా వుండద్దూ?" విసురుగా అంది అనాలనే.

"ఏమిటి?" అన్నాడు ప్రకాశం నొసలు చిట్లిస్తూ.

"వాళ్ళంతా చక్కగా పెళ్ళిళ్ళు చేసుకుని ఫోటోలు వేయించుకుంటే వాళ్ళ ఈడూ జోడూ ప్రసక్తి మీ కెందుకూ?''

"పోనిద్దూ? ఏదో సరదా!"

"అదేం సరదా? పిచ్చి సరదా!" చిరాగ్గా అనేసి గదిలోకి వెళ్ళిపోయింది ఇందిర – సరదా అట: సరదా! వెధవ సరదా! ఏ జోక్సో చదువుకోవచ్చుగా? ఏ కార్టూన్సో చూసుకోవచ్చుగా? అక్కగారు వెళ్ళిపోయాక లలిత కిక్కురుమన కుండా కూర్చుంది బుద్ధిగా పుస్తకం తిరగేస్తూ.

* * *

ప్రకాశం బజారుకి బయల్దేరుతోంటే లలిత గబగబా వచ్చి చెప్పింది–"బావా! ఇవ్వాళ తొందరగా వచ్చెయ్! కల్పలత వుంది. సరదాగా విందాం."

"వచ్చేస్తాలే," అంటూ సైకి లెక్కాడు ప్రకాశం.

ఇందిరకి ఆశ్చర్యం వేసింది. బావా మరదలూ కలిసి వినాలా పాటలు! ఎలా వుంటుందో ఆ సరదా?

అన్నదేగానీ ఈయనగారు పెందరాడే రావటం కూడానా? బావమీద లలితకి వున్ననమ్మకం భర్తమీద యిందిరకి లేదు. కానీ వార్తలుకూడా అవకుండానే వచ్చేశాడు ప్రకాశం.

"ఏమిటివ్వాళ? అప్పుడే గుర్తువచ్చింది యిల్లు?'' నవ్వుతూ అంది ఇందిర.

"ఇంటికి తొందరగా రావటం నేరం కాదుగా?" అంటూ తనూ నవ్వి స్నానానికి పోయాడు.

తీరా కల్పలత ప్రారంభమైతేగానీ ప్రకాశం అంతతొందరగా యింటికొచ్చిన కారణం స్ఫురించనే లేదు ఇందిరకి.

ఇందిర మడతకుర్చీలో వెనక్కి వాలి పడుకుంది.

లలితా ప్రకాశం సుజాతా రేడియో

చుట్టూ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు.

రేడియో పెట్టారేగానీ ఒక్కళ్ళూ పాటలు వినటంలేదు. ఆ పాటల తాలూకు సినిమా కబుర్లు-విమర్శలు-నవ్వులు-

ఇందిరకి తలనొప్పి ప్రారంభించింది.

"చిటపట చినుకులు పడుతోవుంటే
చెలికాడే సరసన వుంటే..."

"అబ్బా! ఈ పాట నాకు భలే ఇష్టం!" అంటూ ఎగిరి గంతేసినంత పని చేసింది లలిత-"షూటింగు అయ్యేవరకూ వాళ్ళు వర్షంలో తడుస్తోనే వుంటారు కదూ బావా? ఓసారి మా ఫ్రెండూ వాళ్ళు మద్రాసు వెళ్ళారట..."

"ఎదటన వున్నది మన మిద్దరమే
అనుకుని హత్తుకు పోతోవుంటే
చెప్పలేని ఆ హాయీ ఎంతో..."

ప్రకాశం లలితకేసి చిలిపిగా చూస్తూ అడిగాడు—"లలితా! ఆ హాయి నీకు తెలుసా?"

"ఛీ! ఫో బావా!" అంది లలిత కోపం నటిస్తూ. నిజంగా లలిత నటిస్తోందనే అన్పించింది ఎందుకో.

ప్రకాశం మళ్ళా అన్నాడు—"పోనీ మీ అక్క నడుగు."

ఇందిరకి ఒళ్ళు చచ్చిపోయింది. వాళ్ళతో పాటు కలిసి నవ్వలేదు.

"ఛీ! ఏం మనుషులు!" అన్పించింది.

ఆ గోల మధ్య పాట అయిపోయింది.

"అందాల చేతులు కందేను పాపం-వస్తుం దిప్పుడు చూడు. పందెం," అంది లలిత ధీమాగా.

"రాదు. పందెం," అన్నాడు ప్రకాశం పోటీగా.

"హారి రిహా ముగ్ధ వధూనికరే!" ప్రారంభమైంది.

"భగవాన్! రక్షించు! రక్షించు!" అంటూ చెవులు మూసేసుకుంది లలిత-"బాబోయ్! ఈ పాట నేను విన్లేను," అంటూ ఆక్రోశించింది.

పాట వినపడుతోన్నట్లే మొహం



చిట్లిస్తోనే వుంది. కాస్సేపటికి అమాయకంగా మొహంపెట్టి-"అయిపోయిందా బావా?" అంది.

"అయిపోయింది," అన్నాడు ప్రకాశం లలిత మొహం చూస్తూ. లలిత చెవులమీద నుంచి చేతులు తీసేసి సినిమాల్లోలాగా కెవ్వుమని అరుస్తూ-మళ్ళా మూసేసుకుంది—"ఛీ! ఫో బావా! అన్నీ అబద్ధాలే," అంది చురచురా చూస్తూ.

ఆ పాట నిజంగానే అయిపోయి—"వరించి వచ్చిన మానవ వీరుడు..." ప్రారంభమైంది.

"బావా! ఆ హారిరిహం ఇంకా అయిపోలేదా?" అంది విసుగ్గా మొహం పెట్టి లలిత.

"లేదు. మళ్ళా నన్ను తిడతావు," అన్నాడు ప్రకాశం.

లలిత మరో ఘడియకి చేతులు తీసేసి-"ఫో బావా! చెప్పవేం? ఈపాట నా కెంతో

యిష్టం. ఈ పిక్చర్ నేను సిక్స్ టైమ్స్ చూశా,'' అంది తన కళాభిరుచి వెల్లడిస్తూ.

"ఇదే కాబోలు సరదాగా పాటలు వినటం అంటే," అనుకుంది ఇందిర విసుక్కుంటూ. ఇంకా కూర్చోబుద్ధి కాలేదు.

"రేడియో కట్టిపారేసి కబుర్లే చెప్పుకోరాదూ?" అంది లేస్తూ.

"ఏం వెళ్ళిపోతున్నావ్?" అన్నాడు ప్రకాశం.

"తలనొప్పిగా వుంది. పండుకుంటా," అంటూ గదిలో కెళ్ళిపోయింది ఇందిర—

లలిత అల్లరీ నవ్వులూ ఇంకా ఎక్కువయ్యాయి.

అక్కడ తను కూర్చున్నంతసేపూ తను వున్నట్టే ప్రవర్తించలేదు వాళ్ళు. ఆ వేళాకోళాలూ - ఒకళ్ళనొకళ్ళు చూసుకోటాలూ ...

...ఛ, తను పిచ్చిగా ఆలోచించటం లేదుకదా? లలిత మొదటినుంచీ చిలిపిదే. ఇక ఈయనా? తను మాట్లాడకుండా నీరసంగా కూర్చుంటే మరదలితో ఏదో కాలక్షేపం. పిల్లలగోల వుండనే వుంది. ఇందిర ఎటూ ఆలోచించలేక కళ్ళు మూసుకు పడుకుంది.

కల్పలత అయిపోయింది. ఎవరో ఆలాపన ప్రారంభిస్తోంటే టక్కున ఆ విద్వాంసుడి గొంతు నొక్కేశారు.

"బ్రతికాం,'' అంది లలిత ఆపదలోంచి బ్రతికి బయటపడ్డట్టు. "అన్నట్టు నువ్వేదో చాలాబాగా పాడతావంటదిగా మీ అక్కయ్య. విందాం. ఓ పాట పాడుదూ!" అన్నాడు ప్రకాశం.

"అక్కయ్యా, పిల్లలూ నిద్రపోతున్నారు. ఎటొచ్చీ పరిగెత్తాల్సినవాడివి నువ్వే. ఈ రాత్రివేళ..ఏ మోకాళ్లో బద్దలు కొట్టుకుంటావు,'' అంది లలిత నవ్వుతూ.

నాకు నచ్చకపోతే నీ నోరు మూసేస్తానుగానీ పాడుదూ...''

"ఏం పాడను? నాకు సంగీతం వగైరా రావు. సినిమాపాటలుపాడనా?"అంటూ-

"నా మాట నమ్మితీ వేలా—''ప్రారంభించింది. పాటంతా విన్నాడు ప్రకాశం. రెండు మూడు పాటలు కోరి పాడించుకున్నాడు. చక్కగానే పాడింది లలిత. తీగలా మృదువుగా తేలిగ్గా సాగుతోంది కంఠం. పాడటంకూడా నేర్పుగానే వుంది. ప్రకాశం సంతోషంగా అన్నాడు. "చాలా బాగుంది లలితా నీ కంఠం, నిజం.''

"అందుకేనా నోరు ముయ్యలేదు?" అంటూ నవ్వింది లలిత. వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటూనే వున్నారు. ఇందిరకు నిద్ర పట్టేసింది.

* * *

లలిత వచ్చి రెండు వారాలపైనే అయింది.

ఇందిర జ్వరం గొడవలో పడి అన్నాళ్లూ సినిమా పేరెత్తకుండా ఓపిక పట్టింది.

"బావా! ఇవ్వాళేదైనా పిక్చర్ కెళ్దామా?" అంది ఆతృతగా.

"ఏం పిక్చరు?"

"ఏదో ఒకటి." ఇంట్లోంచి బయట పడితే చాలన్నట్టుంది లలితకి.

"అలాగే వెళ్దాంలే,'' అన్నాడు ప్రకాశం.

వెళ్దాంలే అంటే కాదు. నువ్వు తొందరగా రావాలి."

"అరె! కట్టుకున్న పెళ్ళాం కూడా నా కిలా ఆర్డర్స్ వెయ్యలేదే!''

"అయితే వద్దులే. నే నసలు సినిమాకి రాను," అంటూ మూతి ముడుచుకుని వంటింట్లోకి పోయింది.

"అరరె! లలితా! లలితా!'' అంటూ వెంటపడ్డాడు ప్రకాశం.

లలిత జడ దొరకబుచ్చుకున్నాడు. "చెప్పు. కోపం పోయిందా?''

ఇందిర బయటికి వచ్చింది- "ఏమిటి?" అంటూ—ప్రకాశం తడబడ్డాడు.

"లలిత పిక్చర్ కెళ్దామని సరదాపడుతోంది. అలాగే లే అన్నా,'' అంటూ వంటింట్లోంచి గబగబా బయటికి పోయాడు. ఇందిర మాట్లాడలేకపోయింది. అలాంటి దృశ్యాలు అప్పుడప్పుడూ చూస్తోనేవుంది. అసలీమధ్య లలిత తన ఎదట మసలటమే మానేసింది. మధ్యాహ్నం పూట తన గదిలో కూర్చుని చదువుకునేది. అదేం లేదు. ఎంతో అవసరమైతే తప్ప దగ్గిరికే రావటం లేదు. సినిమాకి వెళ్తానని ముందు తనతో చెప్పకూడదూ?

"పోనీ తీసికెళ్ళండి. దాని కస్తమానూ సినిమాలు చూడటం అలవాటు," అంది ముభావంగా.

సాయంత్రం నాలుగ్గంటలకల్లా వంటా గింటా చేసేసింది లలిత. పిల్లల్ని తయారు చేసింది. తను ముస్తాబుకు కూర్చుంది.

"లలితా! రెడీయేనా?" అంటూ వచ్చాడు ప్రకాశం, వీధిలోంచే. ఎంత జ్ఞాపకం!

"ఓ! నీదే ఆలశ్యం!" అంటూ బయటకి వచ్చింది లలిత. ప్రకాశం కొత్తగా చూస్తోన్నట్టు చూశాడు.

ఎర్రటి బార్డర్ పరికిణీమీద తెల్లటి టెర్లిన్ ఓణీ వేసుకుంది. ఒంటిపొర పైట మీదికి పెద్ద లాకెట్ ఛెయిన్ వ్రేళ్ళాడుతోంది. రెండుజడలూ రిబ్బన్లు లేకుండా వదిలేసింది. చెవుల రింగులు చెంపలకి తగిలేలా తమాషాగా తల వూగిస్తూ కాఫీ తెచ్చింది.

"తీసుకో బావా! తొందరగా."

ప్రకాశం ఒళ్లు తెలుసుకుని కాఫీ తాగాడు.

లలిత హైహీల్స్ బిగించుకుంది.

"ఇందిరా! మేము వెళ్తున్నాం."

ఇందిర బయటి కొచ్చింది - "ఇప్పట్నుంచీనా? గంటపైగా వుంది."

"అలా షాప్ లవీ చూసుకుంటూ వెళ్తాం."

"బాబుని వుంచెయ్ లలితా! వాడెందుకూ?"

"ఫర్వాలేదులే. నిన్నసలే విసిగిస్తాడు. సుజా నడుస్తుందిగా? నే నెత్తుకుంటాను,"

అన్నాడు ప్రకాశం! అబ్బ! ప్రకాశానికి ఎంత ఓర్పు వచ్చింది!

వాళ్ళంతా వెళ్తోంటే ఇందిర వీధి గుమ్మంలోనే చూస్తూ నించుంది - ఇందిర ఆలోచనలు పరిపరివిధాల పరుగులెత్తాయి. ప్రకాశం మునపట్లా దగ్గిర కూర్చుని "ఎలా వుంది ఇందిరా?" అని అడిగిన పాపాన పోవటంలేదు. ఐదునిముషాలైనా తీరిగ్గా మాట్లాడటం లేదు.

ఇందిరకి జ్వరం తగ్గిందేగానీ నీరసం తగ్గలేదు. లేచి తిరగలేకపోతోంది. చిన్న చిన్న పనులుకూడా చెయ్యలేకపోతోంది. డాక్టర్ నడిగితే "బాగా విశ్రాంతి తీసుకోండి," అన్నాడు.

మందులు మింగి - టానిక్కులు తాగి - కుంటికోడిలా ఎంతసేపూ గదిలో పడుకోవటం తప్పితే మరేం చెయ్యలేకపోతోంది. కావలసిందికూడా విశ్రాంతేగా? నిట్టూర్చింది ఇందిర.


* * *

"అమ్మా! అమ్మా! పిన్ని ... నీ చీర కట్టుకుంటోందీ ... కట్టుకుంటోందీ ..." అంటూ రాగయుక్తంగా పాడుతూ గంతులేస్తూ వచ్చింది సుజాత.

ఏదో నవల చదువుకుంటోన్న ఇందిర పుస్తకం మడిచి చూసింది - "రామ్మా! చూపిస్తానూ!" అంటూ చెయ్యి పట్టుకుంది సుజా.

ఇందిర లేచి వెళ్ళింది. పెట్టిమీద జరీ పువ్వుల నీలంచీర తీసివుంది. లలిత బ్లౌజు కుట్లు వూడతీస్తోంది. అక్కగార్ని చూడగానే అదోమాదిరిగా నవ్వుతూ-"ఇవ్వాళ నీ చీర కట్టుకుంటా నక్కయ్యా! నా బ్లౌజు లేవీ దానికి మేచ్ కావటంలేదు. ఇది చాలా టైట్‌గా వుంది నాకు. అందుకనీ...మళ్ళా కుట్టేస్తాలే," అంటూ చేతులు లూజు చేసింది.

"వద్దు, అది చాలామంచిది. కాస్సేపు ఎటో తిరిగిరావటానికి అంత పెద్ద చీరెందుకూ?" అందా మనిపించింది ఇందిరకి.




"కట్టుకో ఏం పోయింది?" అనేసి వచ్చేసింది.

ఇందిర మనసు మనసులో లేదు.

"పోనీ చిన్నపిల్ల. అస్తమానూ ఇంట్లో చాకిరీ చేస్తూ ఏంవుంటుంది? కాస్సేపు ఎక్కడైనా తిరిగివస్తే బావుంటుంది" - అనుకుంది మొదట్లో. బయటికి వెళ్ళటం ప్రారంభించినదగ్గిర్నుంచీ ఒక్క రోజు కూడా మానలేదు బావామరదళ్ళు. రెండు వారాల్లోనూ ఆరుసార్లు సినిమాల కెళ్ళారు. మిగతా రోజులు బీచ్ కో పార్క్ కో షికారు. రోజూ కొత్తకొత్త బట్టలతో - రకరకాలుగా అలంకరించుకుని బయల్దేరుతుంది లలిత. ఆఫీసు...పని...పని...అని అలమటించే ప్రకాశం ఐదింటికల్లా ఇంటి కొచ్చేస్తాడు. కాఫీ తాగటమే ఆలశ్యంగా బయల్దేరిపోతారు - తొమ్మిదికే తిరిగి రావటం. వచ్చి ఇద్దరూ కబుర్లాడుకుంటూ నవ్వుకుంటూ తింటారు అన్నాలు. మరోగంట హస్కు కొట్టి అప్పుడు పడుకుంటారు.

ఎన్నా ళ్ళీవరస? దానికి బుద్ధిలేకపోతే ఈయన వివేకం ఏమైంది? సరే! వెళ్తే వెళ్తుంది. వెక్కిరించినట్టు ఏరికోరి తన చీర కట్టుకోవటం ఏమిటి? - అన్ని బట్టలున్నాయి. దెయ్యంలాంటి పెట్టి తెచ్చుకుంది. అవన్నీ పనికిరాకపోయాయా?...

తన చీర...అదీ జరీపువ్వుల నీలంచీర... అసలు చాలా ప్రత్యేకత వుంది దీనికి. నాలుగు నెలల క్రిందట-తమ పెళ్ళై ఆరేళ్లు నిండా యని ప్రకాశం స్వయంగా సెలెక్ట్ చేసి తెచ్చాడు. ఆ సాయంత్రం అప్పటి కప్పుడు కట్టుకుంది ఇందిర. తలనిండా మల్లెపూలు పెట్టుకుంది. ఇందిరని చూసి ప్రకాశం చాలా మురిసిపోయాడు.

"సినిమాకి కెళ్దామా?" అన్నాడు.

"ఇప్పు డేం సినిమా? అన్నాలు తినేసి చక్కగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చుందాం," అంది ఇందిర.

"చిన్న సవరణ. కూర్చోవటంకాదు..." అంటూ చిలిపిగా చూశాడు.

ఇందిర కొత్తపెళ్ళికూతుర్లా సిగ్గుపడిపోయింది.

అన్నాలు తిన్నాక వంటిల్లు సర్దుకుని వచ్చేసరికి ప్రకాశం దొంగనిద్ర నటిస్తూ పడుకున్నాడు.

పిల్లలిద్దరూ గాఢంగా నిద్రపోతున్నారు.

ఇందిర నిశ్శబ్దంగా అగరొత్తులు వెలిగించి వెనక్కి తిరిగింది. సెంటుసీసా

గుప్పెట్లో గట్టిగా పట్టుకుంది - మంచం దగ్గిరికి వెళ్దామా అంటే మొదటిరాత్రి లాగా పుట్టెడు సిగ్గు ముంచుకొచ్చింది. ఆరేళ్ళుగా తెలిసిన భర్త - కొత్తవ్యక్తిలా కంగారు పుట్టిస్తున్నాడు. లైటు తీసేసి ఆయన పాదాలు ఒత్తుతూ కూర్చుంది.

ప్రకాశం చీకట్లో దొంగచూపులు చూశాడు. చెయ్యి పట్టుకుని దగ్గిరికి తీసుకున్నాడు - "చీకట్లోకూడా ఈ చీరమీద పువ్వులు మెరుస్తున్నాయే! అబ్బ! నువ్వెంత అందంగా వున్నావు ఇందూ!" అన్నాడు దగ్గిరికి తీసుకుంటూ.

ప్రకాశం హృదయపూర్వకంగానే అన్నాడని ఇందిర ఎన్ని యుగాలైనా గుర్తు వుంచుకుంటుంది. ఆ అనుభూతిలో అంత విశ్వాసం వుంది.

"లలితా! వద్దు, ఆ చీరకాదు. మరేదైనా కట్టుకో,'' అనెయ్యాలని విసురుగా లేచింది.

"అక్కయ్యా! ఎలా వుంది?'' అంటూ వచ్చింది లలిత.

ప్రాన్పడిపోయింది ఇందిర. లలిత ఆ చీర కట్టేసుకుంది. జరీఅంచు పాదాల మీదికి జీరాడేలాగా పొడుగ్గా పెట్టుకుంది. కుచ్చెళ్ళు, పైటకొంగుకూడా పొడుగ్గా వేసుకుంది. ఒకే జడ వేసుకుని జడగుచ్చులు పెట్టుకుంది. రింగులు తీసేసి అక్కగారి రాళ్ళ దుద్దులు పెట్టుకుంది. చేతులకి నిండుగా నీలంరంగు గాజులు వేసుకుంది. కళ్ళకి కాటుక దిద్దుకుని గుండ్రటి కుంకుమ బొట్టు పెట్టుకుంది. ఇందిరవే మఖ్మల్ స్లిప్పర్స్ తొడుక్కుంది.

"ఎలావుం దక్కయ్యా!" అంది లలిత రెట్టిస్తూ-తనకేసి తనే చూసుకుంటూ.

"అమ్మలా వుంది, అమ్మలా వుంది," అంటూ గంతులేసింది సుజాత.

నిజంగా ఇందిరే భ్రమపడింది. ఐదారేళ్ళక్రిందట తను అచ్చం అలాగే వుండేది. ఇప్పుడు...ఈ ఆకారంతో...

"బావుందే! చాలా బావుంది..." అంది భారంగా - "మీ బావ ఇంకా రాలేదు కదూ?" అంది.

"లేదు. ఇంకా రాలేదు. అదే చూస్తున్నా."

అదే చూస్తోందిట. తనకుకూడా లేని తహతహ! నిరీక్షణ!

ప్రకాశం రానేవచ్చాడు. లలితని అపాదమస్తకం ఆశ్చర్యంగా చూశాడు- "వాట్ వండర్! ఇద్దరు ఇందిరలా? అసలు ఇందిరెవరో తెలీటం లేదే!" అంటూ లలిత పైటకొంగు పట్టుకోబోయాడు హాస్యగాడిలా.

లలిత చిరుకోపంతో విదిలించుకొంటూ- "కళ్ళజోడు పెట్టుకోరాదూ?" అంది.

ఇందిర మాట్లాడలేదు. అసలు ఇందిర ఎవరో తెలీటంలేదని తనభర్త హాస్యానికి అంతేమాత్రం భరించగలిగే సహనం తనకెక్కడిది?

"లలితా! కాఫీ తెచ్చియ్యి," అంది చిరాకు ఎంతమాత్రం కన్పించనీయకుండా. ప్రకాశం మొహం కడుక్కువచ్చి కాఫీ తాగాడు.

"ఏం కథ? పెళ్ళికూతురిలా తయారయ్యావ్?" అన్నాడు లలితని వారగా చూస్తూ.

లలిత మూతి ముడిచింది- "నువ్వే అంత మర్చిపోతే... నే నసలు రాన్లే."

"బాబోయ్! అంత కోపమే! ఈ దీనుడు మనజాలడు."

"లేకపోతే ఎవరో ఫ్రెండింటికెళ్దామని చెప్పి ఏం కథ అని అడుగుతావేం?"

"వెరీ సారీ లలితా! మర్చిపోయాను. అయితే నువ్వు రెడీయేగా?"

"ఓ.''

"పద, లెఫ్ట్ రైటేనా?"

"దగ్గిరే అన్నావుగా?"

"మరీ అంత దూరంకాదులే - కబుర్లు చెప్పుకుంటూ పోతే ఎంతసేపు? అంత నడవలేకపోతే అప్పుడే ఎక్కేద్దాం రిక్షా!... ఇందిరా! మేం వెళ్తాం. నిద్రపోకు. మళ్ళా రాత్రి నిద్రపట్టటం లేదని గొడవ చేస్తావు," అంటూ బాబుని ఎత్తుకున్నాడు ప్రకాశం.

ముభావంగా కూర్చునివున్న ఇందిర తలఎత్తి- "వాణ్ణి వుంచెయ్యండి. రోజూ అలా బయట గాలిలో తిప్పుతోంటే ఏ రోంపైనా చేస్తుంది. రాత్రంతా వగ్గుతూనే వున్నాడు," అంది.

ప్రకాశం బాబుని ఇందిరకి ఇస్తోంటే వాడు వుండనని పెనుగులాడా... ప్రకాశం బలవంతంగా దించేస్తూ- అమ్మదగ్గిర వుండు నాన్నా. బిళ్ళ బిస్కత్తులూ అన్నీ తెస్తాను," అ... నచ్చచెప్పబోయాడు.

బాబు ఏడుస్తోంటే ఇందిర లేచి కుంది.

ప్రకాశం లలితా సుజా వెళ్ళిపోయారు. వీధి తలుపులు వేసేసి ఏడుస్తోన్న బాబుకి రెండు బిస్కట్లిచ్చి మళ్ళా గదిలోకొచ్చింది ఇందిర - బావురుమని ఏడ్చెయ్యాలనిపించింది. రోజు లెంత చిత్రంగా మారిపోయాయి! తనతో మాట్లాడే వ్యవధే చిక్కటంలేదు తన భర్తకి... తనే సర్వస్వంలా ప్రవర్తించే వ్యక్తికి!

లేచిన దగ్గర్నుంచీ వురుకులతో పరుగులతో ఆఫీసు - మరదలితో కబుర్లలో నవ్వులలో కొట్టుకుపోతూ భోజనం - మళ్ళా ఆఫీసు - సాయంత్రం షికారు - ఎప్పుడో ఇంటికి రావటం - తిండీ నిద్రా- ఇక సైమేదీ? జబ్బుమనిషితో మాట్లాడేంత తీరికేదీ?- మనస్సంతా వికలమైపోయింది ఇందిరకి.

తలగడా మీదికి ఒరిగి ఇంటికప్పుకేసి చూస్తూ పడుకుంది. జరీపువ్వుల నీలంచీర చూస్తే తన కేవేవో మధురస్మృతులు గుర్తొచ్చాయి. ఆయనకి కూడా ఏవైనా జ్ఞాపకం వచ్చాయా?

* * *

"ఈ చీర మీ అక్కకన్నా నీకే బావుంది



లలితా! నిజం," అన్నాడు ప్రకాశం లలిత మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

లలిత గంభీరంగా సముద్రం కెరటాల కేసి చూస్తోంది.

లలితని ఫ్రెండింటికి తీసికెళ్ళాలని బయల్దేరిన ప్రకాశం తీరా కొంతసేపు నడిచాక— "ఇప్పు డెళ్తే వాళ్లుంటారో లేదో! పోనీ బీచ్‌కి పోయి కూర్చుందాం లెద్దూ! సరదాగా కబుర్లు చెప్పుకుందాం," అన్నాడు ప్రాధేయపడుతోన్నట్టు.

"అయితే పద," అంది లలిత సంశయించకుండా.

ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. దిగేంతవరకూ ప్రకాశం శరీరంనిండా విద్యుత్తు పరుగులెత్తింది. వారగా లలిత మొహం చూస్తూ కూర్చున్నాడు. రిక్షా దిగి బాగా దూరం నడిచి ఏకాంతంగా కూర్చున్నారు—

"మాట్లాడవేం?" అంటూ రెట్టించాడు ప్రకాశం.

లలిత అప్పుడే స్వప్నంలోంచి తేరుకున్నట్టు— నెమ్మదిగా కళ్ళు తిప్పి "ఏమిటి?" అంది.

"ఈ చీర నీకు చాలా బావుంది."

"ఎవరికైనా బాగానే వుంటుంది."

"అలాక్కాదు. ఎంత అందమైన బట్టలైనా కొందరికే రాణిస్తాయి. నువ్వు మీ అక్కకన్నా ఎత్తు; తెల్లటి తెలుపు, బొద్దుగా వుంటావు. అందుకే నీకు మరీ బావుంది."

"బావగారు బట్రాజు లౌతున్నారే!" అంది లలిత నవ్వుతూ.

"నీలాంటి అందగత్తెని చూస్తోవుంటే కవిపుంగవుణ్ణికూడా అయిపోతాను," అన్నాను బెదిరిస్తోన్నట్టు.

లలిత చిరునవ్వు నవ్వింది విలాసంగా. లలిత పైటచెంగు గాలిలో ఎగిరెగిరి పడుతోంది. ఆ కొంగుపట్టి దగ్గిరికి లాక్కోవాలని గుబగుబ లాడుతోన్న మనస్సుని మందలించలేక — "ఆ కొంగు అలా వదిలేశావేం?" అన్నాడు ప్రకాశం ఏదో మాట్లాడాలని.

"దానికి స్వతంత్రం యిచ్చేశాను."

"అదేం స్వతంత్రం? చీరంతా విప్పేసి గాలిలోకి విసిరెయ్,"

కిలకిల నవ్వింది లలిత—పాదాల మీద ఇసక పోసుకుని ఆడుకుంటోన్న సుజా తల తిప్పి పిన్నికేసి చూసింది. గబగబా లేచి వచ్చి లలిత పైటకొంగు పట్టుకుని భుజం మీద కప్పుతూ—"పిన్నీ! మా అమ్మయితే యిలా వేసుకుంటుంది," అంది

"ఛీ! ఫో వే! వెధవ ఇసకచేతుల్తో నా జాకెట్టంతా పాడుచేశావు. పెద్దాపేరక్కలా ముసుగెట్టుకోమంటావా?" అంటూ విసుక్కుంది లలిత—సుజా మళ్లా తన ఆటలో మునిగిపోయింది. లలిత ఎప్పటిలా మాటలు పెంచకుండా అడిగిన

దానికి మాత్రమే సమాధానా లిస్తూ సముద్ర కెరటాల కేసి చూస్తూ కూర్చుంది.

నీరెండ తెల్లటి ఇసకమీదా — నీటి నురుగుమీదా పడి వెన్నెలలా మెరుస్తోంది. చల్లటిగాలి హాయిగా ఒంటిని తాకుతూ ఆహ్లాదం కలిగిస్తోంది. సముద్రం తన మహా గర్భంలో ఎన్నోకోట్ల సంగీతవాయిద్యాలను దాచుకున్నట్టు గంభీరంగా తరంగాల పాట పాడుతోంది.

"లలితా!" అంటూ అప్రయత్నంగా లలిత చేతిని పట్టుకున్నాడు ప్రకాశం. చురచుర చూస్తూ లలిత చెయ్యి లాక్కున్నప్పుడుగానీ త నేం చేశాడో ప్రకాశానికి తెలియలేదు — "అది కాదు లలితా! చెయ్యి చూస్తాను," అన్నాడు తొణక కుండా.

"ఏం చూస్తావు? జ్యోస్యం చెప్తావా?"

"ఏదో చెప్తాగా? చెయ్యిలాతే. ముట్టుకుంటేనే నీ బంగారం నాకేం అంటదులే," అంటూ చొరవగా చెయ్యి చేతుల్లోకి తీసుకున్నాడు. తెల్లగా మృదువుగా మెత్తటి బంగారంతో చేసినట్టుందా చెయ్యి. గలగలమంటూ గాజులన్నీ ముంజేతి మీదికి వచ్చిపడ్డాయి. హస్తసాముద్రికం ఎంతో తెలిసినవాడిలాగా అరచెయ్యి విప్పి గుచ్చి గుచ్చి చూశాడు ప్రకాశం—"వూ! తెలిసింది. చెప్పనా?"

చెప్పమన్నట్టు నవ్వింది లలిత.

"ఈ పాణిగ్రహణం చేసినవాడు ధన్యుడౌ తాడు."

"ఊఁ" ఎడంచేతి చూపుడువేలు పెదవుల మధ్య పెట్టుకుంది సినిమాల్లోలాగ.

"ఈ అందమైన చేతితో అందించిన పదార్థం ఏది తిన్నా సరే, అమృతాన్ని రుచిచూసినట్టు పీనుగులాంటివాళ్ళయినా ఏనుగు లౌతారు."

"భలే వుందే జ్యోస్యం! ఖర్మగాలి ఈ చేత్తోనే చెంపకాయ తింటే..."

"దాసాను దాసు డౌతాడు.

నవ్వింది లలిత—"చాల్లే," అంటూ చెయ్యి లాక్కోబోయింది. ప్రకాశం గట్టిగా పట్టుకున్నాడు — "నే నో మాట అడుగుతాను. నిజం చెప్తావా?" కొంటెగా చూశాడు.

"కాలేజీలో నువ్వెవరినైనా ప్రేమించావా? నువ్వు ప్రేమించకపోయినా కుర్రాళ్ళు వూరుకోరే! ప్రేమలేఖలు వస్తూనే వుండాలి అవునా?"

లలిత సిగ్గుపడ్డ దానిలా తల దించుకుంది — "నువ్వు చదువుకునే రోజుల్లో ఎన్ని ప్రేమలేఖలు రాశా వేమిటి?"

"రాసినవి కొన్నీ—రాయనివి కొన్నీ-రాసీ రాయనివి కొన్నీ."

"అందరూ అలాగే అనుకోరాదూ?"

"అయితే నీకు ప్రేమ పత్రాలు వస్తూనే వున్నాయన్నమాట. ఎవడి మొర అయినా చెవిని పెట్టావా? ఆ అర్జీలు కాస్తా కుంపట్లో పడేశావా?"

తన చిరునవ్వుకోసం—తన పలకరింపు కోసం—తన స్నేహంకోసం తపిస్తూ ఉత్తరాలు రాసే రమేష్ గురించి బావతో చెప్పేద్దామా అనుకొంది లలిత. తీరా వింటే ఏమంటాడో! ఒక్క రమేష్ ఏమిటి? ఎంతమంది రమేష్‌లైనా తనకోసం తపిస్తారు. లలిత మళ్ళా సముద్ర కెరటాలలోకి చూస్తూ కూర్చుంది.

"మనిషంత మనిషిని పక్కన కూర్చుని వుంటే నువ్వా నీళ్ళలో వెతుక్కుంటా వెందుకూ? ఏ రాజకుమారుడైనా ఓడ మీద వస్తానన్నాడా? స్వప్న సందేశం పంపించాడా?"

లలిత నవ్వింది - "నిజంగానే నీకు కవిత్వం వస్తోంది."

"కవిత్వం కాదు. ఉన్నమాటే. నిన్నెవడు కొట్టేస్తాడోగానీ లక్కీ - ఫెలో! అభినందించాల్సిందే."

"ఏం? నీకు జెలసీగా వుందా?"

"ఉండదూ?"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? అసలు రెండేళ్ళాగి నిన్నే చేసుకోవాల్సింది నేను."

కిలకిలా నవ్వింది లలిత - "అక్కయ్య వింటే బాగానేవుంటుంది."

"ఏం? దాని దగ్గిరే అంటాను. ఎప్పుడూ మూలుగుతూ పక్కవదలకుండా పడుకోవటం మాత్రం తెలుసు. నీ కాలి గోటికికూడా తీసికట్టే." విసుక్కున్నాడు ప్రకాశం.

"నిజంగా బావా! ఎప్పుడూ అలా ఈసురోమంటూ వుండేవాళ్ళని చూస్తే నాకు చెడ్డ అసహ్యం! చకచకా పనులు చేసేసుకోవాలి. సినిమాకో - షికారుకో - పిక్నిక్‌కో-పార్టీకో - ఏదోఒకటి యాక్టివ్‌గా తిరుగుతూండాలి. లేకపోతే లైఫ్ డల్‌గా వుండదూ?"

"డల్‌గా వుండట మేమిటి? బోర్ కొడుతోంది. ఎప్పుడూ ఇల్లూ-పిల్లలూ-రోగాలూ-తెగుళ్లూ..."

"అసలు తెగుళ్ళు రావటానికి సైకలాజికల్ ఫీలింగే కారణం బావా? ఉత్సాహంగా లేనివాళ్ళకే ఈ తెగుళ్ళన్నీ వస్తాయి. వాళ్లూ బాధపడతారు; అందర్నీ బాధ పెడతారు."

"బాగా చెప్పావు. బాధ కాకపోతే ఏం సుఖం వుంది బ్రతుక్కి." నిస్పృహగా అన్నాడు ప్రకాశం.

"అలా అనకు బావా!" లలిత ప్రకాశం కళ్ళలోకి - సానుభూతిగా ఓదార్పుగా - జాలిగా-ప్రేమగా - ఎలాగో-ఇంకెలాగో-చూసింది- "బావా! నేనే నీ భార్యనైతే నీకు స్వర్గసౌఖ్యాలు చూపించేదాన్ని, ఆనంద సాగరాల్లో ముంచెత్తేదాన్ని, వెన్నెల సీమల్లో తేలించేదాన్ని. ప్చ్! నువ్వు దురదృష్టవంతుడివి," అన్న భావాలు లలిత చూపుల్లోంచి తొంగితొంగి సిగ్గుపడుతూ చూశాయి.

ఎందుకో నిట్టూర్చాడు ప్రకాశం.

లలిత మృదువుగా చూస్తూ- "ఏదైనా పాడనా బావా? ప్లీజ్! నువ్వు మాత్రం

అంత డల్‌గా వుండకు. నేను భరించలేను," అంది.

"అబ్బే! ఏం లేదులే. పాడు,''-మొహం తిప్పుకుని సముద్రంకేసి చూడసాగాడు. ప్రకాశం.

లలిత రెండు నిముషాలసేపు తనకు వచ్చిన పాటలన్నీ మననం చేసుకుంది.

"నల్లనివాడా! నే గొల్లకన్నెనోయ్! పిల్లనగ్రో వూదవోయ్! నా వుల్లము రంజిల్లగా...'' అంటూ పాడింది. బాల సరస్వతి స్వరంలోని మృదుత్వం తప్పితే అంతా అలాగే పాడింది. సరస్వతి గొంతులా సుఖమాధుర్యంతో పరవశత్వం కల్గించక పోయినా వినటానికి చాలా యింపుగా వుంది.

"బావుంది లలితా! చాలాబాగా పాడావు. ఇంకోపాట పాడు,'' అన్నాడు ప్రకాశం. ఇంకోటి-మరోటి-నాలుగైదు పాటలు పాడింది లలిత.

ప్రకాశానికి వుత్సాహం వచ్చింది-"ఎవడైనా ప్రొడ్యూసర్ విన్నాడంటే నిన్ను తప్పకుండా సినిమాల్లోకి పట్టుకు పోతాడు.''

పొంగిపోయింది లలిత- "బావా! నిజంగా నాకు సినిమాల్లో పాడాలనివుంది."

గాలి సినిమాలమీదికి మళ్ళింది. లలిత పాటగాళ్ళను చాలామందిని విమర్శించింది. కొంతమందిని మెచ్చుకుంది.

"మంచిఛాన్స్ వస్తే తప్పకుండా వెళ్ళి పోవచ్చు లలితా!''

"వెళ్తేగానీ మంచీ చెడ్డా ఎలా తెలుస్తాయి?''

"అంతపనిమాత్రం చెయ్యకు. ఏమో! ఏమౌతుందో నమ్మలేం. అయినా నీకు వయస్సు మాత్రం ఏదీ? ముందు చదువు కానీ.''

"పిన్నీ! ఇంటికి పోదామే!'' హఠాత్తుగా లేచింది సుజా.

బావా మరదళ్ళిద్దరూ బాహ్యప్రపంచంలో కళ్ళు విప్పి చూశారు. బాగా చీకటి




పడింది. లలిత సుజా చెయ్యిపట్టి కూర్చో బెట్టింది.

"అప్పుడే ఇంటికెళ్ళి ఏం చెయ్యాలి? కూర్చో! వెళ్దాంలే," అంటూ.

"ఊహూ! నాకు నిద్రొస్తోంది."

"నా ఒళ్ళో పడుకో, ఇంటికెందుకూ?"

"ఆకలేస్తోంది పిన్నీ!"

"అబ్బబ్బ! ఏం సాధిస్తున్నావే! రేపు నిన్ను తీసుకొస్తానేమో చూడు."

"పోనీ లలితా! పద వెళ్దాం. చీకటిపడి పోయిందిగా?" అంటూ లేచాడు ప్రకాశం. లలితకి లేవక తప్పలేదు.

ఇందిర తలుపులు తీసి గదిలోకి వెళ్ళి పోయింది.

సుజా అన్నం తినేసి తల్లిపక్కలో చేరింది - "అమ్మా!...నిన్ను...నాన్న తిట్టాడే!...పిన్నికూడా తిట్టిందే..."అంది ఏదో చెప్పాలన్న తాపత్రయంతో.

"ఛ! తిట్టటం ఏమిటి?" అంది ఇందిర అర్థం కాక.

"నీకు...జొరం...జొరం...ఎప్పుడూ పడుకుంటా వనీ..."

చాలు ఇందిరకి అర్థమైంది కొంత వరకైనా.

"ఇంకా నాన్నేమో..."

"సరేలే. పడుకో." కూతుర్ని కసిరింది.

కళ్ళు మూసుకు పడుకుంది సుజా - కాస్సేపటికి-"మరేమో, పిన్ని...ఎంచక్కా బోలెడు పాటలు పాడిందే!" అనేసింది వుండబట్టలేక.

"అసలు మీ రెక్కడి కెళ్ళారు?" అడగొద్దనుకుంటూనే అడిగింది ఇందిర.

"బీచికమ్మా! ఇసకలో ఆడుకున్నాను."

ఇందిర సుజా తల తడిమింది. పాపిడి నిండా ఇసకే. గౌను జేబునిండా ఇసకే - ''సరేలే. పడుకో." అంది జోకొడుతూ.

వంటింట్లోంచి మాటలింకా విన్పిస్తోనే వున్నాయి.

కాస్సేపటికి ప్రకాశం పడుకోవటానికి వచ్చాడు-''ఇందిరా! బాబేం ఏడిచాడా?"

''లేదు."

''నీ ఒంట్లో ఎలావుంది?"

"బాగానే వుంది.''

"బాగానే వుందంటావ్. లేచితిరగవేం? కాస్త హుషారుగా అటూ ఇటూ తిరుగు తూండాలి. జ్వరం లేదుగా?"

ఇందిర నిశ్శబ్దంగా నిట్టూర్చింది.

ప్రకాశం పడుకున్నాడు.

ఎంత ప్రయత్నించినా — ఎంత సరి పెట్టుకున్నా - ఇందిరకి తెల్లవార్లూ నిద్ర పట్టలేదు. ఇందిర హృదయం ఏడుస్తోంది. సహించలేక సతమతమౌతోంది—

మనుషులు ఇంత అమానుషంగా మారటం సంభవమేనా? తన భర్త తనని యిలా నిర్లక్ష్యం చేసేరోజు వస్తుందనీ- జీవితం ఇంత చేదునిజాన్ని మింగిస్తుందనీ- ఒకనాడు ప్రేమానురాగాలతో ఉప్పొంగిన హృదయం ఇంత ఎడారిలా ఎండిపోతుందనీ- భగవంతుడా! ఇంకా ఏం నగ్న సత్యాలు చెప్పబోతున్నావు? నీ నిజాలలో నలిగి నాశనమయ్యే ప్రేమకోసం అలమటించే హృదయాల్ని నువ్వెందుకు సృష్టిస్తావు...?

ఇందిర దాదాపు జాగారం చేసింది రాత్రంతా.

కళ్లు ఉబ్బి ఎర్రగా జేవురించాయి.

లేచినదగ్గిర్నుంచీ బొత్తిగా గది కదల బుద్ధికాలేదు. ఎలాగో స్నానం చేసి తల దువ్వుకుని మళ్ళా గదిలోకే వచ్చి కూర్చుంది.

ప్రకాశం ఆఫీసు కెళ్ళిపోయాడు. లలిత వంట చేస్తోంది.

"లలితని పంపించేస్తే?"

పిచ్చివూహ! లలితని పంపించేసి ప్రకాశాన్ని దక్కించుకోవాలా? అదేనా తను కోరుకుంటోంది?—

లలిత వీక్లీకోసం ఎదురుచూస్తూ తనతో తర్కించిన నాలుగు మాటల్లోనూ లలిత హృదయం తేటతెల్లమైంది.

గతమంతా తల్చుకున్న ఇందిర బ్రమాన్పడిపోయింది ఎంతో సేపు. లలిత మనస్సు ఇంత స్పష్టంగా తెలిసికూడా ఇంకా తను నిర్లిప్తంగా వూరుకోవచ్చునా? ఇదంతా తనకోసం కాదు-లలితకోసం.. లలిత శ్రేయస్సుకోసం- లేకపోతే తనే లలితకి చాలా అన్యాయం చేసిన వ్యక్తి అవుతుంది. ఇంకా పరిస్థితి విషమించనివ్వటం మూర్ఖత్వం!

"అయితే ఇవ్వాళ వీక్లీ రానేలేదన్నమాట. అనుకున్నంతా చేశాడు వీడు. దొంగవెధవ," అంటూ లలిత పేపరు ఒక్కటీ పట్టుకు వెళ్ళిపోయింది.

ఇందిర లేచి వంటింట్లోకి వెళ్ళింది. చేతి కందినది సర్దుతూ కాసేపు తిరిగింది—

"లలితా! అన్నం తిందాం వస్తావా?" అంటూ గట్టిగా పిల్చింది.

లలిత పేపరు పట్టుకుని వంటింట్లో కొచ్చింది - "రోజూ నేను బావకి పెట్టి తింటున్నాగా?" అంది.

"ఇవ్వాళ నేను పెడతాలే, తినేసెయ్. నేనూ తినేస్తా. వడ్డించనా?" అంటూ పళ్ళేలు తీసింది ఇందిర.

లలిత ఇబ్బందిగా మొహం పెట్టింది; "అప్పుడే ఏం అన్నం బాబూ?"

"అప్పుడే ఏమిటి? పదకొండు దాటింది. అసలు నీకు తొమ్మిదవకుండానే తిండి తిని కాలేజీకి పోవటం అలవాటేగా?"

"అవుననుకో. ఇక్కడి కొచ్చాక..."

"మరి చోద్యం. హైస్కూల్లో చేరిన దగ్గిర్నుంచీ వున్న అలవాటు ఇక్కడి కొచ్చాక నెల్లాళ్ళ భాగ్యానికే మారిపోయిందా? సరేలే, నేను వడ్డించుకుంటా."

"అయితే నాకూ పెట్టెయ్ తినేస్తా," అంటూ పేపరు పడేసివచ్చి కూర్చుంది -

పెద్దగా సంభాషణేమీ జరగలేదు.

"అబ్బ! ఆకలి వెయ్యటంలేదు," అంటూ పెట్టిన అన్నం అంతా తినేసి పిడికెడు అన్నం వుంచుకుంది. ఇందిర కూడా రోజూలా తినలేకపోయింది.

ఆఫీసునుంచి ప్రకాశం వచ్చాడు.

అన్నం వడ్డిస్తూ ఇందిర కన్పించింది.

"ఏం? లలి తేమైంది?"

"చదువుకుంటోంది. కూర్చోండి."

"పిలిస్తే వస్తుందిగా? నీ కెందుకూ శ్రమ?"

"మీకు అన్నం వడ్డించటానికి నాకు శ్రమేమిటి?"

"అదిగాదు. నీ కోసమే. మళ్ళా ఒంటి కేమైనా..."

"నా ఒంటిసంగతి నాకు తెలీదూ? తేలిగ్గా వుంది కాబట్టే లేచి తిరుగుతున్నాను."

కిక్కురుమనకుండా కూర్చున్నాడు -

"అబ్బో! ఇంత అన్నం పెట్టేశా వేమిటి?"

"మీ తిండి విషయం నాకు తెలీనట్టు మాట్లాడతా రేం?"

విన్పించుకోకుండా అన్నం తినేశాడు ప్రకాశం.

"అస లేమైనా కడుపు నిండాలా?"

"నిండ కేం?" అంటూ లేచాడు ప్రకాశం.

వండుకున్నదంతా గిన్నెలోనే వుంది. అందరి కడుపులూ నిండిపోయాయి మరి. ఇందిర పళ్ళెం తీసి గిన్నెలన్నీ సర్దుతోంది.

ప్రకాశం లలితదగ్గిరికి వెళ్ళాడు.

"కోపం వచ్చిందా అమ్మాయిగారికి?"

బోర్లా పడుకున్న లలిత తలెత్తి చూసింది- "ఎందుకూ?"

"ఏమో! అన్నం పెట్టకుండా తప్పించుకున్నావుగా?"

"చాల్లే! మా అక్కయ్యే వడ్డిస్తానంటే వూరుకున్నాను."

ఇందిర వంటింటి తలుపులు వేసి వచ్చింది.

ప్రకాశం తల దువ్వుకుంటూ ఇందిరని వుద్దేశించి అన్నాడు- "అయితే నీకు ఆరోగ్యంగానే వుందన్నమాట. థేంక్ గాడ్!"

ఇందిర మాట్లాడలేదు.

ప్రకాశం మళ్ళా ఆఫీసుకి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం పొయ్యి ఇందిరే అంటించి కాఫీలు పెట్టింది.

లలితకి చాలా ఆశ్చర్యంగా వుంది. అక్కయ్య ఏమిటో కొత్తగా వుంది.-

"అదేమి టక్కయ్యా! పోనీ అన్నం నేను వండేస్తాలే. నీకు మళ్ళా జ్వరం తిరగబెడుతుందేమో."

"ఫర్వాలేదు. జ్వరం వస్తే వంట చెయ్యలేంగానీ - వంట చేస్తే జ్వరం రాదు."

లలిత కేం తోచలేదు. ఏదో పుస్తకం పుచ్చుకుందిగానీ చదవ బుద్ధికాలేదు.

మాటిమాటికీ వీధిగుమ్మంకేసి చూస్తూ కూర్చుంది."

ప్రకాశం రానేవచ్చాడు. రోజూలా – "లలితా! రెడీయేనా?" అన్నాడు. అంతలో లలిత వాటం చూసి "అరె! ఇంకా యిలాగే వున్నావేం? ఇవ్వాళ ఎటూ వెళ్ళొద్దా?" అన్నాడు నీళ్ళు కారిపోతూ.

"ఎటు వెళ్దాం?" అంది లలిత కొంచెం నెమ్మదిగా.

"కాస్సేపు ఎటయినా తిరిగివద్దాం."

ఇందిర కాఫీ తెచ్చింది.

లలిత మొహం కడుక్కుని జడవేసుకుంది. పెద్ద ఆడంబరాలేమీ చెయ్యలేదు. జోళ్ళు తొడుక్కుని రెడీగా నించుంది.

"ఇందిరా! ఒంట్లో బాగానే వుందని ఆర్భాటా లేమీ చెయ్యకు. అన్నం వార్చేసి కూర్చో," అంటూ హెచ్చరించి వంటిల్లు దాటాడు ప్రకాశం.

ఇందిర అయోమయంగా కూర్చుండిపోయింది.

పొద్దుటినుంచీ తను లేచి తిరుగుతోనే వుంది. ఒంట్లో బాగానే వుందనికూడా చెప్పింది. తనూ వస్తుందేమో నని వాళ్ళ కెందుకు తోచలేదు?

తనని మాటమాత్రమైనా అడగకుండా వాళ్ళిద్దరూ అలా వెళ్ళగలిగారంటే – అసలు తనగురించి వాళ్ళేమనుకుంటో న్నట్టు?


"ఇప్పుడు మీ అక్క ఏం చేస్తూ వుంటుందో తెలుసా?"

"ఏం చేస్తూ వుంటుంది?"

"పొడుగాటి చీపురు పట్టుకుని – గోచీ పోసి – కొంగు బొడ్లోదోపి ఇంట్లో బూజులు దులుపుతూ వుంటుంది." నవ్వాడు ప్రకాశం. లలితకి నవ్వాలన్నంత ఉత్సాహంగాలేదు.

* * *

కొంచెం తొందరగానే తిరిగివచ్చారు యింటికి.




ఇందిర వీధివాకిట్లో మడతకుర్చీ వేసుకుని కూర్చుంది.

"అదేమిటి? మంచులో కూర్చున్నావు," అన్నాడు ప్రకాశం.

"మంచేం లేదు. బాగానే వుంది." అంది ఇందిర క్లుప్తంగా.

"అయినా మంచిదికాదు. లోపలికి వెళ్ళి పడుకో."

ఇందిర లేవలేదు. ప్రకాశం లోపలికి వెళ్ళిపోయాడు.

వంటింట్లోకి వెళ్ళిన లలిత బయటికి వస్తూ—"అక్కయ్యా! నువ్వింకా అన్నం తినలేదా? అన్నం అంతా అలాగే వున్నట్టుంది," అంది.

"లేదు. మీ రిద్దరూ తినెయ్యండి."

"ఏం? నువ్వు రారాదూ?"

"నే నివ్వాళ తినన్లే. ఏమిటోలా వుంది."

లలిత వెళ్ళిపోయింది.

పావుగంటలో ఇద్దరూ అన్నాలు తిని బయటి కొచ్చారు.

"చూశావా? వద్దు మొర్రో అంటే వినకుండా లేచి తిరిగావు. ఇంకా కొన్నాళ్ళు రెస్ట్ తీసుకుంటే నీ దేం పోయింది?" అన్నాడు మందలిస్తోన్నట్టు ప్రకాశం.

"ఇప్పటికే నా సర్వస్వం పోయింది," అందా మనుకుంది ఇందిర. లేచి లోపలికి వెళ్ళిపోయింది.

ప్రకాశం లలితా చెరోకుర్చీలో కూర్చున్నారు. కబుర్లు చెప్తూ ఖారాకిళ్ళీ నమిలిన ప్రకాశం—"లలితా! కొంచెం మంచినీళ్ళు తెస్తావా?" అన్నాడు.

లలిత వంటింట్లోకి వెళ్ళి అక్కగార్ని చూసి ఆశ్చర్యపోయింది. ఇందిర అన్నం తింటోంది.

గ్లాసుతో నీళ్లు తీసుకుని బయటికి వచ్చేసింది—"మా అక్కయ్య అన్నం తింటోంది."

"అన్నం తింటోందా? ఒంట్లో బాగా లేదని చెప్పిందన్నావుగా?"

"మరి నాతో అలాగే అంది."

"ఉండు. నేను చూస్తాను." ప్రకాశం వంటింట్లోకి వెళ్ళాడు.

ఇందిర పళ్ళెం కడిగి బల్లమీద పెడుతోంది.

"ఇందాక ఒంట్లో బాగా లేదన్నావటగా?"

"అవును. అన్నాను."

"మరి యిప్పుడు తిన్నావెందుకూ?"

"ఇప్పుడు బాగానే వుంది."

"ఇందిరా! ఎందుకా అర్థం పర్థంలేని మాటలు?"

"ఇప్పటికైనా అర్థాలకోసం వెతుక్కుంటే సంతోషమే. మీ యిద్దరికీ అడ్డం రావటం యిష్టంలేక ఇందాక ఒంట్లో బాగాలేదన్నాను. మీరు సంతోషంగా కబుర్లాడుకొంటూ అన్నాలు తింటారు రోజూ. నేనెందుకూ మధ్య?"

ప్రకాశం ఆశ్చర్యంగా చూశాడు. ఇందిరకి చాలా కోపం వచ్చిందనిమాత్రం అర్థమైంది. ప్రకాశానికి కోపం వచ్చింది.

"అసలు నువ్వనేదేమిటి?'' అన్నాడు. సూటిగా చూస్తూ.

"మిమ్మల్ని నేనేమీ అనలేదే! మీతో కలిసి అన్నం ఎందుకు తినలేదని అడిగితే నావుద్దేశ్యం చెప్పాను. ప్రతీ సమస్యకీ ఏదో పరిష్కారం వుండితీరాలి. అదే నేను యివ్వాళ్టినుంచీ ఆచరణలో పెట్టదల్చుకున్నాను."

ప్రకాశం తెల్లబోయాడు-"పరిష్కారమా? అసలు ఏం సమస్య వచ్చిపడిందిప్పుడు?"

"ఈ యింట్లో నాకు అయిష్టంగా ఎన్నో జరుగుతున్నాయి. జరగరానివి జరుగుతున్నాయి. అది సమస్య కాదా నాకు?"

"నీకు అయిష్టంగానా? జరగరానివా? ఎందుకిలా చిరాకుపడతావు? చెప్పేదేదో సరిగ్గా చెప్పరాదూ?"

"ఏం జరుగుతున్నాయో మీకు తెలును. నాకూ తెలుసు. ఇలా చిరాకుపడిపోతూ నా మాటలన్నీ వినమని మిమ్మల్ని నేను నిర్బంధించటం లేదే!''

"అన్నదేదో అనేసి నిర్బంధించటం లేదంటే సరిపోతుందా? నీ ఏడుపు నాకు తెలుసు. నేను లలితతో సరదాగా మాట్లాడతాననేగా ఈ గోలంతా. నన్నే అర్థం చేసుకోలేకపోయావంటే నిన్నేమనుకోవాలి? నా చెల్లెలెంతో లలితా అంతే."

ఇందిర శరీరమంతా అసహ్యంతో జలదరించింది. ఎంతఘోరం! "చూడండి. నన్ను వంచించండి, ఫర్వాలేదు. మిమ్మల్ని మీరు వంచించుకోవద్దు. ఆత్మవంచన మహానీచం. చెల్లెలితో ప్రవర్తించినట్టే లలితతో తిరుగుతున్నానంటే చాలా దారుణం. పైటకొంగులు పట్టి లాగటం, బుగ్గలు గిల్లటం, కాయితం వుండలు విసరటం - ఇవన్నీ మీరు సోదర భావంతోనే చేస్తున్నానంటే......నమ్మటానికి నాకింకా పిచ్చెక్కలేదు."

ప్రకాశం ఒక్కక్షణం మాట్లాడలేకపోయాడు.

ఇందిర ఎత్తిచెప్పిన చేష్టలు ఎన్నోసార్లు ఇందిర చూసినప్పుడూ చూడనప్పుడూ కూడా చేశాడు తను. అయితేమాత్రం? "మరదలు కదాని ఏదో సరదాకి...... హాస్యానికి..."

ఇందిరకి పట్టరాని కోపం వచ్చింది - కాస్సేపు చెల్లెలు, కాస్సేపు మరదలూనా? కలిసి కాపరంచేసే భార్యతోకూడా లేని హాస్యాలూ, సరదాలూ మరదలితోనా? నన్నే పరాయిస్త్రీలాగ చేసి అంటకుండా, ముట్టకుండా ఒక్క నిముషంకూడా దగ్గిర నిలబడకుండా - మరదలితో ఛలోక్తులూ - కబుర్లూ - నవ్వులూ - షికార్లూ- సినిమాలూ-ఇదంతా సరదాకేనా? వుత్త సరదాకేనా?''

ప్రకాశం ఆవేశంగా కళ్ళెర్రచేశాడు- "ఇరవైనాలుగ్గంటలూ ముక్కుతూ, మూలుగుతూ మంచం పట్టుకుని పాకులాడుతూ గదివదలకుండా కూర్చుంటావు. ఆఫీసులో చచ్చి చచ్చి వచ్చి కాస్సేపలా శాంతిగా సుఖంగా ఏ సినిమాకో షికారుకో వెళ్ళటంకూడా తప్పే అయిందా? అంత నమ్మలేనిదానివి మొదటే ఎందుకు చెప్పలేకపోయావు?"

హఠాత్తుగా మాటలు ఆపేసి గదిలోకి పోయి పడుకుందామనిపించింది ఇందిరకి. హృదయం చచ్చిన మనుషులతో ఈ తర్క వితర్కాలెందుకూ? గుండెల్లో ఆవేశమంతా తగ్గించుకుని విరక్తిగా అంది - "నావాళ్ళు అనుకున్న వ్యక్తుల్ని నేను శంకించేంత నీచానికి ఒడిగట్టలేకపోయాను. అలా అని ఎదట కన్పిస్తోన్న నిజాల్ని చూడకుండా కళ్ళు మూసుకోవటంకూడా నాకు చేతకాలేదు. ఇరవైనాలుగ్గంటలూ మూలుగుతూ పడుకుంటానా? ఒక్క నెలరోజులు అనారోగ్యముతో వున్నానని మీకు సుఖశాంతులు దూరమయ్యాయా? వాటిని వెతుక్కోవాలనే బయటికి పరిగెత్తుతున్నారా?"

ఇందిర కంఠం భారమైపోయింది. దుఃఖం దిగమింగుతూ అంది- "ఎందుకింత అన్యాయంగా మాట్లాడుతున్నారు? ఈ నెల్లాళ్ళ రోగం సంగతేగానీ ఈ ఆరేళ్ళ కాపరంలో ఏరోజూ మీకు గుర్తురాలేదా? ఇందిరతో గడిపిన ఒక్క నిముషంకూడా జ్ఞాపకం లేదా? మన సంసారంలో ఏనమ్మకాలూ మిమ్మల్ని బంధించటం లేదా?"

ప్రకాశం మండిపడుతూ అన్నాడు- "ఎందుకవన్నీ చదువుతావు? అసలు ఇప్పుడు నేనేం కానిపని చేశానని ఇంత నిలదీసి ప్రశ్నలు వేస్తున్నావు?"

"మీరేంచేసినా నేను ప్రశ్నలు వెయ్యను! వెయ్యకూడదు. హృదయాలు చంపుకుని సాహసించి చేస్తే ఏదీ కాని పని అవదు. మీరు ఆఫీసులో కష్టపడి ఇంటికి రావటం ఇవ్వాళ నాకు కొత్త కాదు. నా దగ్గిర కూర్చుని మీ మంచి చెడ్డలు ముచ్చటించేవారు. మాటల్లో మునిగి బయట చికాకులన్నీ మర్చిపోయేవారు. గడిచిపోయిన ప్రతిక్షణాన్నీ నేను గుండెల్లో గుప్తంగా దాచుకున్నాను. అందుకే నాకింత బాధ! ఈ నెల్లాళ్ళలోనూ ఒక్కపూటైనా ఒక్క పావుగంట- కనీసం పదినిముషాలైనా దగ్గిర కూర్చుని కష్టసుఖాలు అడిగారా? మనస్సు విప్పి మాట్లాడారా? ఏదీ? మీకు తీరికేదీ? రోగిష్ఠిదానితోపాటు ఈ మారుమూల గదిలో కూర్చునేంత ఓపికేదీ? పోనీ మీతోపాటు... ఒక్కరోజైనా ఎప్పుడైనా బయటికి తీసుకు వెళదామన్న ఆలోచన



వచ్చిందా ? ఏం ? నేను మీతో నవ్వుతూ మాట్లాడలేనా ? హాయిగా చల్లగాలిలో తిరగలేనా ? రిక్షాలలో వెళ్ళి సినిమాలు చూడలేనా ? కాళ్ళులేక కుంటిదా న్నయ్యానా ? కళ్ళు పోయి కబోది నయ్యానా ? పుట్టెడు జ్వరం వచ్చి – నీరసంతో బాధపడుతున్నానని నన్ను మీ రేం కనిక[illegible]ారు ? నా కష్టసుఖాలు పంచుకోవాలని మీ రేం ప్రయత్నం చేశారు? ఈ నెల్లాళ్ళనుంచీ ప్రతీక్షణం నే నెంత కుమిలిపోయానో – మీ సానుభూతి కోసం ఎంత తపించానో మీకు తెలుసా?– అసలీ యింట్లో ఇందిర అంటూ ఒక

దౌర్భాగ్యురాలు వుందన్న సంగతే విస్మరించి - నేనేం కానిపని చేశా నని సమర్థించుకుంటున్నారా?"

ప్రకాశం నోరువిప్పి మాట్లాడలేక-వూరుకోలేక-విసురుగా తలవిదిలించాడు- అవును. తెలివితక్కువే. ఒక్కసారైనా ఇందిరకూడా వస్తుందేమో అడగలేదు. రమ్మని పిల్చి తీసికెళ్ళలేదు. అలా గంటల తరబడి-ఇంట్లో ఒక్కతే ఎలా వుండగలదనికూడా ఆలోచించలేదు. కానీ...కానీ- నిజంగా ఇందిరంటే తన కేం ద్వేషం కాదే! అయిష్టం కాదే!——

——"ఇదంతా నా బాధకొద్దీ నేను అడిగాను. పోనివ్వండి. ఏడ్చి మొత్తుకునీ అనురాగాలు సంపాదించలేం. ఈ ఆరేళ్లూ అబద్ధపు ఆనందంతో గడిపాం. మిమ్మల్ని నేనేమీ సుఖపెట్టలేకపోయాను. మీ మనస్సులో మధురమైన జ్ఞాపకాలు మిగల్చలేకపోయాను - సుఖశాంతులకోసం మీరు మరోచోట వెతుక్కునే పరిస్థితి వచ్చింది. ఇక ఏ పునాదుల బలంమీద మన సంసారం నిలుస్తుందో నాకు అర్థంకావటంలేదు. ఇవ్వాళ కాకపోతే రేపైనా యిది కూలి తీరాల్సిందే. దాంపత్య జీవితం జ్యోతిలా వెలగాలంటే దంపతుల హృదయాలలో అనురాగరసం వూటలా వూరుతూ వుండాలి. అది ఎండిపోయిన తర్వాత ఈ కళేబరాలతో కాపరాలు చెయ్యలేం. హృదయం గాఢంగా వాంఛించే వాళ్ళతోనే జీవితం ముడిపెట్టుకోవటం-అయిష్టంగా కాపరాలు చెయ్యటంకన్నా నీచం కాదు. లలిత పెళ్ళి చేసుకునే ఏర్పాట్లేవో తొందరగా చేసుకోండి.నాకేం అభ్యంతరం లేదు."

"ఇందిరా! నీ కేం పిచ్చెక్కిందా?" కసిదీరా అరిచాడు ప్రకాశం.

ఇందిర సూటిగా చూసింది—— "నాకు పిచ్చెక్కిందని మీరంటే సరిపోతుందా?"

"లేకపోతే నేను లలితని పెళ్ళి చేసుకోనా? నువ్వు చచ్చిపోయావనా?"

ఇందిర నీరసంగా నవ్వింది- "మనుషులు చచ్చిపోయినా వివాహబంధం చెక్కుచెదరదు. మనసులు చచ్చిపోతేమాత్రం అది ఒక్కక్షణంకూడా నిలవదు. నేనే చచ్చిపోయానో - మీ మనసే చచ్చిపోయిందో అర్థం చేసుకోండి."

"ఇందిరా! ఎందు కవన్నీ తవ్వి పోస్తావు? లలితతో...కొంచెం మితిమీరి ప్రవర్తించానేమో - కాదనను. కానీ... ఇంతవరకూ లలితని..." మాట్లాడలేక పోయాడు ప్రకాశం. ఇందిరకి ఇలా సంజాయిషీ చెప్పుకునే పరిస్థితి తెచ్చిపెట్టుకోవటం ఎంత మూర్ఖత్వం! ఇందిరని ఎంతో యిష్టంతో పెళ్ళి చేసుకున్నాడు. ఇందిరతో కాపరం చేస్తూ తన యిష్టాన్ని ద్విగుణీకృతం చేసుకున్నాడు. ఇందిర తననెంత ప్రేమించిందో-ఎంత సుఖపెట్టిందో- ఒక్క నెల్లాళ్ళ భాగ్యానికే మర్చిపోయేంత నీచు డయ్యాడేం తను?

"ఇందిరా! నా మాట నమ్ము. నీ గురించి నేనెప్పుడూ అన్యాయంగా ఆలోచించలేదు. ఏదో తెలివితక్కువగా చేశానని యింత బాధపడటం నీకు ధర్మంగా వుందా?''

ఇందిర అసంతృప్తిగా అంది - "నేను మాటలకన్నా చేతలకే విలువ యిస్తాను. పోయిన విశ్వాసాన్ని బలవంతంగా బంధించుకోవటం నాకు చేతకాదు - మిమ్మల్ని శాసించే హక్కు నాకు లేదు. మీ రేం చేసినా నాకిష్టమే నని కాయితంమీద రాసి యిస్తాను. అంతే. ఇక నేనేం చెప్పలేను ... నా తల తిరుగుతోంది ... నించోలేను." కళ్ళలో నీళ్ళు కళ్ళలో కుక్కుకుంటూ బరువుగా అడుగులు వేస్తూ... తడబడుతూ ... గదిలోకి వెళ్ళిపోయింది ఇందిర.

మధ్యగదిలో ప్రమాన్పడి నించునివున్న లలితని చూడకుండా అంగలు వేసుకుంటూ వీధిలో కెళ్ళిపోయాడు ప్రకాశం.

* * *

బాగా చీకటితో లేచిపోయింది లలిత. తన గుడ్డలన్నీ వుండలు చుట్టి పెట్లో కుక్కేసింది. మొహం కడుక్కుని తల దువ్వుకుంది. వంటింటికేసి తొంగి చూడకుండా వసారాలో కూర్చుంది.

ఇందిర కాఫీగ్లాసు తీసుకువచ్చింది.

లలిత ఎటో చూస్తున్నట్టు మొహం తిప్పుకుని - "ఇవ్వాళ నేను వెళ్ళిపోదామనుకుంటున్నాను," అంది క్లుప్తంగా.

ఇందిర ఆశ్చర్యపడింది - "అదేమిటి? నువ్వు వెళ్ళటం ఏమిటి? నేనే వెళ్ళిపోదామనుకుంటున్నాను."

వెర్రిదానిలా చూసింది లలిత.

"నిజమే లలితా! గాఢంగా ప్రేమించుకుంటోన్న వాళ్ళని విడదియ్యడా[illegible]ం రాక్షసినా? నువ్వు మీ బావ [illegible]సు కుంటావో, ఏం చేసుకుంట[illegible]తా నాకెందుకు గానీ, మీ రిద్దరూ సుఖంగా వుండాలని మాత్రం కోరతాను. బావ వేసెక్టమీ చేయించుకున్నారు. నీకూ తెలుసు. చూలెంతా బాలెంతా అయ్యే చికాకు లేవీ నీ కుండవు. అందం చెడదు. యౌవ్వనం పోదు. రోగం రొష్టూ రాదు. అంతకన్న ఏం కావాలి? మీ రిద్దరూ ఆడుతూ పాడుతూ కలిసీ మెలిసీ యుగాలు క్షణాల్లా గడిపెయ్యగలరు. ఈ మాట రాత్రే మీ బావకి చెప్పేశాను. ఈ క్షణం నుంచీ ఈ యిల్లు నీదే! నేనే మధ్యాహ్నం బండికి వెళ్ళిపోతాను...''

లలిత చెంపలమీద నుంచి కన్నీళ్ళు బొట్లు బొట్లుగా జారిపడుతున్నాయి. తల దించుకుని కూర్చుంది.

ఇందిర దగ్గిరికి వెళ్ళింది-"ఇలా చూడు లలితా! ఎందు కేడుస్తావు? ఇలాంటి పరిస్థితుల్లో కూడా మనం మనస్సులు విప్పి మాట్లాడుకోకపోతే ఎలా? ప్రేమల్లూ విచారాలూ గుండెల్లో పెట్టుకుని కుళ్ళిపోవటం ఎందుకూ ?"

"నేనేం కుళ్ళిపోవటం లేదు." విసురుగా అంది లలిత.

"లేదంటే నేను నమ్ముతానా? నీ ప్రవర్తన నాకు తెలియటం లేదా? నిన్న కథ విషయంలో వాదించినప్పుడు నీ అభిప్రాయం కూడా నాకు తెలిసిపోయింది. అంతవరకూ నా మొగుడు చేస్తోన్న పిచ్చిపనులకే నేను బాధపడ్డాను గానీ నిన్ను శంకించలేదు. కాని...నువ్వే అన్నావుగా? సావిత్రి చచ్చిపోయి, నళిని వేణుగోపాల్‌ని పెళ్ళి చేసుకుంటే బావుంటుం దనీ..."

"అది కథ కదాని అలా అన్నాను. ంతేగాని..."

విస్మయంగా చూసింది ఇందిర–'కథలు ్రితాల్లోంచి తయారౌతా యనేంత ్న విషయం కూడా నీకు తెలీదా తా? మరెందుకు కథలకోసం ఎగబడ ్? నాకే కథలు రాయటం చేతనైతే ్న మధ్య జరిగినదంతా ఒక కథగా ాయలేనా? అసలు జీవితంలో వున్న నమ్మలేని నిజాల్నీ – ఘోరమైన నిజాల్నీ – ఎన్ని కోట్ల కథలు రాస్తే తరగుతా యంటావు?—సరేలే. కథల విషయం వదిలేద్దాం. నీ సంగతి చెప్పు. నువ్వు మాత్రం వెళ్ళటానికి వీల్లేదు. నేను అమ్మకి అంతా అర్థమయ్యేలా చెప్తాను. ఆ భయం నీ కేం లేదు."

లలిత కంగారుగా లేచి నించుంది—గబగబా చెంపలు తుడుచుకుంది—"అక్కయ్యా! నువ్వు పెద్దదానివే గానీ నన్ను మరీ చిన్నపిల్లని చేసి అపహాస్యం చెయ్యకు. బావ కదా అని చనువుగా తిరిగాను...అందుకని...'' లలితకి చాలా కోపం వచ్చేసింది.

ఇందిరకేసి రోషంగా చూస్తూ మళ్ళా అంది–"నిన్ను పెళ్ళి చేసుకుని నీతో ఇన్నేళ్లు కాపరం చేసి ఇద్దరు పిల్లల్ని కని ఇవ్వాళ మళ్ళా నన్ను చేసుకుంటానంటే నే నెలా ఒప్పుకుంటా ననుకున్నావు?"

"ఎందుకు ఒప్పుకోవు? మరి ఆయన్ని అన్నివిధాలుగా ఎందుకు కవ్వించావు?




మమ్మీ– అదిగో ఆవు!

ఆకర్షణ అనేది ఎప్పుడు ఎవరిమీద కలిగినా సమర్థనీయమే అన్నావు కదూ? అసలు మీ బావ నన్ను ప్రేమించకుండా యిన్నాళ్ళూ ప్రేమిస్తున్నా ననే భ్రమతోనే కాపరం చేశారేమో! ఇప్పటికి ఆయన నిన్ను ప్రేమిస్తోన్నట్టుగా గుర్తించుకున్నారు. కాదని ఎలా అనగలవు? అంతే కాదు, రేపు ఆయన నిన్ను వదిలేసి మరో సుందరిని ప్రేమించా నంటే నువ్వు మన స్ఫూర్తిగా అంగీకరించాలి. బహుశా ను వ్వా అగత్యం రానివ్వవులే."

లలిత మాట్లాడలేకపోంది. మొహం ముడుచుకుని నించుంది.

''లలితా! నీ మీద నా కేం కోపంలేదు. నా మాట నమ్ము. నీ తెలివితక్కువని చూస్తేమాత్రం విచారంగా వుంది. నేను నీకన్నా పెద్దదాన్ని. కొంచెం లోకజ్ఞానం తెలిసినదాన్ని. నీకిష్టంవున్నా లేకపోయినా ఒక్కమాట చెప్తాను విను. ఇవ్వాళ కాలేజీలో చదువుతూ తుళ్ళుతూ గెంతుతూ తిరగటం మాత్రమే జీవితం కాదు. ఇంకా ముందుముందు జీవితంలో ఎన్నో దశలు– ఎన్నో పరిస్థితులు – ఎన్నో సమస్యలు చూడాలి. చిన్నప్పటి జ్ఞాపకాలుకూడా చెదరకుండా మనం ముసలివాళ్ళమై మట్టిలో కలిసిపోతాం.

ఇవ్వాళ అందంగా ఆరోగ్యంగా వుచ్చ స్థితిలో వున్నావని, కురూపుల్నీ – రోగిష్టుల్నీ – దీనుల్నీ – అనాథల్నీ – ఎవర్నీ అసహ్యించుకోకు. ఎవరి జీవితాల్లోనైనా ఏవైనా లోపాలుంటే వాళ్ళని సానుభూతితో అర్థం చేసుకో. నీకు చేతనైన ఉపకారం చెయ్యి. వాళ్ళ లోపాలు వేలెత్తి చూపించి అపహాస్యం చెయ్యకు. వాళ్ళకు జీవితంమీద విరక్తి కల్గించకు.

మనిషై పుట్టిన ప్రతివ్యక్తికీ ఏ ప్రత్యేకతలు లేకపోయినా స్పందించే హృదయం వుంటుంది. ఎంత చిన్న దెబ్బ తగిలినా అది జీవితపర్యంతం రోదిస్తుంది. ఎవ్వర్నీ బాధించకుండా ఎవ్వర్నీ ద్వేషించకుండా బ్రతకటమే నిజమైన మానవత్వం–లలితా! నీకు నచ్చినా నచ్చకపోయినా జీవిత గ్రంథాన్ని ఎప్పుడైనా తిరగవేసుకుంటే స్పష్టంగా కంటికి కన్పించేలా ఏదో ఒక పుటలో ఈ ఘట్టాన్నంతా ప్రత్యేకంగా చిత్రించుకో. అక్కయ్య ఇంటికి వెళ్తే యిలా అయిందనిమాత్రం ఎప్పుడూ బాధపడకు. జీవితం అనుభవాల పుట్ట."

లలిత మాట్లాడలేదు. ఇందిర మాట్లాడించలేదు.

"ఇవ్వాళ వీక్లీ వచ్చిందమ్మా!" కిటికీలోంచి పిల్చాడు పేపరు కుర్రాడు.

"అక్కడ పడెయ్," అంది ఇందిర వంటింట్లోకి పోతూ.

లలిత విని వూరుకుంది. కదల్లేదు. ★